న్యాయమైన పరిహారంతోనే సాంత్వన

కలెక్టర్‌కు రైతుల వినతి

వేజెర్ల, పొదలకూరు, ఆత్మకూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఇచ్చే పరిహారంతో.. మేము కోల్పోయే భూమిలో సగం కూడా కొనలేం. అందరం కొద్దిపాటి భూమి ఉన్న చిన్న రైతులం. ప్రభుత్వం పెద్ద మనసుతో మాకు నష్టం జరగకుండా న్యాయమైన పరిహారం అందేలా చూడాలని నడికుడి- శ్రీకాళహస్తి మార్గంలో భూములు కోల్పోతున్న రైతులు కలెక్టర్ ఆనంద్‌కు విన్నవించారు. రైల్వే మార్గం కోసం సేకరించిన భూమికి చాలా తక్కువ పరిహారం నిర్ణయించారని రైతులు ప్రభుత్వానికి విన్నవించడంతో.. శుక్రవారం కలెక్టర్ వేజెర్ల, పొదలకూరు, ఆత్మకూరు మండలాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. రైల్వే మార్గం ప్రతిపాదించిన సమయంలోనే పరిహారం చెల్లించి ఉంటే, సమీపంలో భూములు కొనుగోలు చేసేవారమని, పదేళ్లలో ధరలు మూడింతలయ్యాయని రైతులు వివరించారు. క్రయ విక్రయాల్లో విలువ తక్కువగా చూపిన కారణంగా.. పరిహారం, గణన విలువ తగ్గ తొందని ఆవేదన వ్యక్తం చేశారు. భూముల వాస్తవ విలువ, క్షేత్రస్థాయి అంశాలను ప్రభుత్వానికి వివరించి.. న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి భరోసా ఇచ్చారు. దస్త్రాల్లో లోపాలు ఉంటే సరిచేస్తామని, వివాదాస్పద భూముల అంశాన్ని అథారిటీకి నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో బి.పావని, తహసీల్దారు మస్తానయ్య, రెవెన్యూ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.


పెరుమాళ్లపాడు వద్ద రైతులతో చర్చిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఆర్డీవోలు

ఏమారితే.. ఏమవునో!



కృష్ణపట్నం రోడ్డు నుంచి హరనాథపురం వైపు గోతులు.. అపోలో ఎదురుగా ముత్తుకూరు - కృష్ణపట్నం రహదారి దుస్థితి


చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డుకు వెళ్లే దారి దయనీయం

గత మూడురోజులుగా కురిసిన భారీ వర్షాలకు నగరంలోని రోడ్లు దారుణంగా తయారయ్యాయి. నెల్లూరు అపోలో ఎదురు సందు కృష్ణపట్నం రహదారి నుంచి హరనాథపురం మీదుగా జాతీయ రహదారిని కలిపే రోడ్డుపై లోతైన గుంతలు పడి రాకపోకలకు వాహనదారులు భయపడుతున్నారు. గత ప్రభుత్వం సగం నిర్మించి వదిలేసింది. మిగిలిన సగం రోడ్డు ఇలా గోతులమయమైంది. వర్షం పడి నీరు చేరి గోతులు పెద్దవయ్యాయి. ముత్తుకూరు కృష్ణపట్నం రహదారి కూడా గుంతలతో దర్శనమిస్తోంది. అధికారులు స్పందించి రోడ్లకు శాశ్వత మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

- ఈనాడు, నెల్లూరు

వెలుగొండ పూర్తితోనే సస్యశ్యామలం

ఉదయగిరి : బడ్జెట్‌లో నిధులు కేటాయించి.. వెలుగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వెలుగొండ సాధన సమితి నాయకుడు డాక్టర్ శ్యాంప్రసాద్, సాగునీటి రంగ నిపుణుడు నారాయణరెడ్డి కోరారు. స్థానిక కోట్నీస్ వైద్యశాలలో శుక్రవారం జిల్లా సాధన సమితి, ప్రజా సంఘాల నాయకులతో కలిసి వెలుగొండ ప్రాజెక్టు సాధన కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కడప, ప్రకాశం, నెలూరు జిల్లాల్లోని 4.47 లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు వెనుకబడిన 30 మండలాల ప్రజలకు తాగునీరు అందించే లక్ష్యంతో వెలుగొండ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారన్నారు. ఫ్లోరైడ్ సమస్య రూపుమాపేందుకూ చక్కటి పరిష్కారమన్నారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్నా.. ప్రాజెక్టును పూర్తి చేయడంపై పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీలకు అతీతంగా ప్రాజెక్టు పూర్తికి ఉద్యమించి.. ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నాయకులను కోరారు. ప్రాజెక్టు పూర్తికి చర్యలు తీసుకోకపోతే వెలుగొండ సాధన సమితి ఉద్యమం తీవ్రతరం చేస్తుందన్నారు. వెలుగొండ ప్రస్తుత స్థితిగతులు, ప్రయోజనాలను ప్రస్తావించారు. కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నాయకులు దస్తగిరి అహమ్మద్, రామిరెడ్డి, రైతు సంఘం నాయకుడు వెంకటయ్య, ఫడ్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ రమణయ్య పాల్గొన్నారు.

చినపవని క్షేత్రంపై.. చిన్నచూపు!


చినపవని విత్తనాభివృద్ధి క్షేత్రం భూములు

పరిశోధన కేంద్రం మంజూరైనా.. నిరుపయోగం ● కూటమి ప్రభుత్వంపై రైతుల ఆశలు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే

ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాల రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తూ ఓ వెలుగు వెలిగిన చినపవని విత్తనాభివృద్ధి క్షేత్రం.. నేడు నిరుపయోగంగా మారింది. నూతన వంగడాల తయారీ అటుంచి.. ఉన్న భూములు బీళ్లుగా మారుతున్న దుస్థితి నెలకొంది. వందల ఎకరాల ఈ క్షేత్రాన్ని.. వినియోగంలోకి తేవాలన్న లక్ష్యంతో ఎన్జీరంగా విశ్వవిద్యాలయానికి అప్పగించి, పరిశోధనా కేంద్రం మంజూరు చేసినా.. రైతులకు ఏ మాత్రం అక్కరకు రావడం లేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

గతమెంతో ఘనం

లింగసముద్రం మండలం చిన్నపవని గ్రామ సమీపంలో 543 ఎకరాల్లో విత్తనాభివృద్ధి క్షేత్రం ఏర్పాటు చేశారు. కొన్నేళ్లపాటు రైతులకు అవసరమైన విత్తనాలు అందించడంతో పాటు పలు రకాల నూతన వంగడాలు తయారు చేశారు. ఈ క్షేత్రం భూములకు రాళ్లపాడు జలాశయం నీరే దిక్కు. కాగా.. 1994, 96ల్లో రెండు దఫాలు రాళ్లపాడు రిజర్వాయరు కట్ట తెగిపోయింది. అప్పటి నుంచి క్షేత్రం బీడుగా మారింది. 2010-11లో తిరిగి అందుబాటులోకి తేవాలని నిర్ణయించి.. జంగిల్ క్లియరెన్స్ చేయించి.. రెండు వైపులా కంచె ఏర్పాటు చేశారు. తగినంత మంది సిబ్బందిని నియమించకపోవడంతో.. ఫలితం లేకపోయింది. 2019 జనవరిలో క్షేత్రాన్ని చిరుధాన్యాలు, అపరాల పరిశోధన కేంద్రంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. అనంతరం ఏర్పడిన వైకాపా ప్రభుత్వం రెండేళ్లు ఈ విషయాన్ని పట్టించుకోలేదు. 2021లో పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు 413 ఎకరాల క్షేత్రం భూములను ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయానికి అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. మిగిలిన 130 ఎకరాలు రోడ్డుకు తూర్పున ఉండటంతో.. దాన్ని అలాగే వదిలేశారు.

అయినా.. ఏదీ ప్రయోజనం

పరిశోధనా కేంద్రానికి ఒక శాస్త్రవేత్త, ఏఈవో, ఒక రికార్డు అసిస్టెంట్‌ను మాత్రమే నియమించారు. అది కూడా కావలి పరిశోధనా కేంద్రం తరపున.. వాస్తవానికి పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో పప్పు ధాన్యాలు, నూనెగింజలు, కొర్రలు, అరికెలు, సామెలు తదితరాల సాగు చేయడంతో పాటు నూతన వంగడాలు సృష్టించాలన్నది లక్ష్యం. గత మూడేళ్లలో వంద ఎకరాల్లోపే పంటలు సాగు చేయగా.. వాటి వల్ల రైతులకు ఒనగూరిన ప్రయోజనమూ పెద్దగా లేదు. మరోవైపు జంగిల్ క్లియరెన్స్, నిర్వహణకు ఏటా రూ. 20 లక్షలకుపైగా ఖర్చు చేస్తున్నట్లు సమాచారం.

అసంపూర్తి.. అసౌకర్యం

పేరుకు పరిశోధనా కేంద్రం మంజూరు చేశారేగానీ.. విద్యుత్తు సౌకర్యం లేదు. స్తంభాలు ఏర్పాటు చేసి.. తీగలు లాగలేదు. వేసిన పంటలను కాపాడుకునేందుకు రెండు పక్కల కంచె లేకపోవడంతో స్థానికులు పశువులు, గొర్రెలను మేపుకొంటున్నారు. దీనికి తోడు సిబ్బంది కేటాయింపు జరగలేదు. రాళ్లపాడులో నీరుంటేనే పంటలు సాగయ్యే పరిస్థితి.. దీంతో గత ఏడాది 50 ఎకరాల్లో మాత్రమే మినుము, నువ్వులు, పెసర వేశారు. గోదాము, కార్యాలయ భవనాలు నిధుల కొరతతో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం దృష్టిసారించి.. వసతులు కల్పించి.. వినియోగంలోకి తెస్తే మేలైన విత్తనాలు అందించే అవకాశం ఉందని రైతులు కోరుతున్నారు.

వినియోగంలోకి తెస్తాం

త్వరలో 40 ఎకరాల్లో వరి వంగడాలు సాగు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. క్షేత్రానికి సంబంధించి కొన్ని సమస్యలు ఉన్న మాట వాస్తవమే. విద్యుత్తు సౌకర్యం లేకపోవడంతో పాటు పలు ఇబ్బందులు ఉన్నాయి. క్షేత్రంలో ఉన్న భూమి మొత్తం బాగానే ఉంది. త్వరలోనే వాటిని వినియోగంలోకి తీసుకువస్తాం. - శ్రీనివాసరెడ్డి, విత్తనాభివృద్ధి క్షేత్రం శాస్త్రవేత్త

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా

నెల్లూరు(నగరపాలకసంస్థ) : మరింత మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేసే వారిని గుర్తించి, జరిమానాలు విధించాలని నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటరులో శుక్రవారం ఆయన పారిశుద్ధ్య విభాగం అధికారులు, శానిటేషన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యర్థాలను రోడ్లపై వేసే వారిని గుర్తించి.. ఎక్కువ సంఖ్యలో జరిమానాలు వసూలు చేయాలని వాణిజ్య ప్రాంతాల్లోని కార్యదర్శులను ఆదేశించారు. శానిటేషన్ కార్యదర్శులు రోజూ క్షేత్రస్థాయిలో పర్యటించి.. పారిశుద్ధ్య సమస్యలను గుర్తించి.. కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు తెలియజేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖాళీ ప్లాట్ల యజమానులను గుర్తించి.. నోటీసులు జారీ చేసి, శుభ్రంగా ఉంచుకునేలా చూడాలని, ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణకు డ్రెయిన్లలో అక్కడక్కడా జల్లెడ ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య, డీఈ సాయిరామ్, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓపెన్ రీచ్‌లకు.. రీ టెండర్!

తక్కువ ధరకు కోట్ చేయడంతో.. అధికారుల పునరాలోచన

'పెన్నా నదిలోని ఇసుకను కూలీలతో తవ్వించడం.. దాన్ని ట్రాక్టర్‌లో నింపించడం.. అక్కడి నుంచి సమీపంలో ఏర్పాటు చేసిన నిల్వ కేంద్రంలో దించడం.. అనంతరం మళ్లీ అక్కడ లారీలో లోడ్ చేయడం'.. ఇదీ ఓపెన్ రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలు దక్కించుకున్న గుత్తేదారులు చేయాల్సిన పని. దీనికి ప్రభుత్వం రూ. 144.50గా నిర్ణయించి.. టెండర్లు పిలిచింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. జిల్లాలో గుత్తేదారులు కోట్ చేసిన ధరలే అధికారులను విస్తుబోయేలా చేశాయి. కేవలం రూ. 36 ఇస్తే చాలు.. ఆ పనులన్నీ మేం చేసిపెడతామంటూ పలువురు టెండర్లు వేయడం చర్చనీయాంశమవుతోంది.



ఈనాడు, నెల్లూరు

జిల్లాలోని విరువూరు, మినగల్లు, పల్లిపాడు, పడమటి కంభంపాడు రీచ్‌ల్లో మాన్యువల్(కూలీలతో)గా ఇసుక తవ్వి నిల్వ కేంద్రానికి తరలించేందుకు జిల్లా యంత్రాంగం టెండర్లు పిలిచింది. మొత్తం 22 మంది 43 టెండర్లు దాఖలు చేశారు. ఒక్కొక్కరు రెండు, మూడు రీచ్‌లకు ప్రయత్నించారు. అందులో ప్రతిపాదించిన ధరలే ఆశ్చర్యపోయేలా ఉన్నాయి. టన్నుకు రూ. 150 వరకు చెల్లిస్తే గానీ, గిట్టుబాటు కాదని వ్యాపారులే చెబుతున్నారు. ప్రజలకు త్వరితగతిన ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో.. జిల్లా అధికారులు లాటరీ విధానం అమలు చేశారు. ఒక్కో రీచ్‌కు ఇద్దరి పేర్లు(ఒకరు గుత్తేదారు, మరొకరు రిజర్వు) ఎంపిక చేశారు. వారిలో మొదటి వారికి టెండరు దక్కగా.. ఆయన చేయని పక్షంలో రెండో వ్యక్తి పనులు చేసేలా నిర్ణయించారు. కాగా, అతి తక్కువ ధరలు కోట్ చేయడం వెనుక దురుద్దేశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తుండటంతో.. అధికారులు పునరాలోచనలో పడ్డారు.

పారదర్శకత కోసమే..

ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు అన్ని రకాలుగా కృషి చేస్తున్నాం. జిల్లాలోని నాలుగు ఓపెన్ రీచ్‌లకు టెండర్లు నిర్వహించగా.. చాలా మంది తక్కువ ధరకు కోట్ చేశారు. నిబంధనల ప్రకారం వారికే ఇవ్వాలి. అలా చేస్తే, అక్రమ తవ్వకాలు జరిగే అవకాశం ఉందన్న ఉద్దేశంతో.. లాటరీ విధానంలో తీసి అప్పగించాలనుకున్నాం. దీనిపైనా భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉండటంతో.. ఆ టెండర్లు రద్దు చేశాం. టెండర్ నిబంధనలను కాస్త కఠినతరం చేసి.. త్వరలోనే మళ్లీ ఆహ్వానిస్తాం.

- ఆనంద్, జిల్లా కలెక్టర్

విమర్శల నేపథ్యంలో...

గిట్టుబాటు కాని ధరలు కోట్ చేసిన గుత్తేదారులకే లాటరీ విధానంలో ఇసుక తవ్వకాల బాధ్యత అప్పగించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమైన నేపథ్యంలో దిద్దుబాటు చర్యలు ప్రారంభించారు. నష్టానికి తవ్వకాల బాధ్యతను తీసుకున్న గుత్తేదారులు.. నిత్యం కొన్ని లోడ్లు దారి మళ్లించి.. అక్రమంగా అమ్ముకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. దాంతో గురువారం జరిగిన లాటరీ విధానాన్ని(టెండర్లు) రద్దు చేశారు. టెండరు నిబంధనలను మరింత కఠినతరం చేసి.. త్వరలో మళ్లీ టెండర్లు నిర్వహించి.. అర్హులైన వారికి అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు ఓ నియోజకవర్గంలో ఇసుక టెండర్లు దక్కించుకున్న గుత్తేదారుడిని అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు బెదిరించడంతో.. సదరు వ్యక్తి దాన్ని రద్దు చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదీ టెండర్లు రద్దు కావడానికి ఓ కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విజిలెన్స్ అధికారుల దాడులు

అల్లూరు, న్యూస్‌టుడే: అల్లూరు మండలంలోని వరి విత్తన తయారీ కేంద్రాలపై శుక్రవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. వ్యవసాయశాఖ నుంచి అనుమతులు తీసుకున్నారా? నిబంధనలకు అనుగుణంగా విత్తన అమ్మకాలు జరుగుతున్నాయా? లేదా? అనే విషయాలను పరిశీలించారు. విజిలెన్స్ ఎస్పీ డీఆర్ రాజేంద్రకుమార్ మాట్లాడుతూ.. ఆకస్మిక దాడులు చేసినట్లు తెలిపారు. అధికారులు వేణుగోపాల్, నాగరాజు, పెంచల్‌రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.


తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

దరఖాస్తులకు గడువు పెంపు

నెల్లూరు(విద్య): ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు డీఈవో పీవీజే రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా 25వ తేదీలోపు ఆన్‌లైన్ ప్రవేశాలు పొందొచ్చన్నారు.

అయిదేళ్లుగా.. ఆటకు నిరీక్షణే

ప్రారంభానికి నోచుకోని మొగళ్లపాలెం ఇండోర్ మైదానం ● నేడు శాప్ ఛైర్మన్ రాక

న్యూస్‌టుడే, నెల్లూరు (క్రీడా విభాగం)

జిల్లా... క్రీడాకారులకు పెట్టింది పేరు. ప్రోత్సాహమిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయి రాణిస్తారు. గత అయిదేళ్ల జిల్లాలో క్రీడాభివృద్ధికి బాటలు పడలేదు. గతంలో తెదేపా ప్రభుత్వం తీసుకొచ్చిన క్రీడా వికాస కేంద్రాలు పూర్తికాలేదు. బాలికల కోసం నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్మించతలపెట్టిన బాలికల భవనం సైతం అసంపూర్తిగా ఉంది. నెల్లూరుగ్రామీణ మండలం మొగళ్లపాళెంలోని ఇండోర్ స్టేడియం పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. శనివారం జిల్లాకు వస్తున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు వీటన్నింటిపై దృష్టి సారించాలని క్రీడాకారులు కోరుతున్నారు.


మొగళ్లపాలెం ఇండోర్ స్టేడియం

ఉపయోగంలోకి తెస్తే..

జిల్లాలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మల్టీపర్పస్ ఇండోర్ మైదానాన్ని నిర్మించాలని గత కొన్ని సంవత్సరాల క్రితం నుంచే ప్రతిపాదనలు ఉండగా, ఎవరూ పట్టించుకోలేదు. 2014 సంవత్సరం నుంచే ఇండోర్ స్టేడియం విషయం అందరి దృష్టిలో ఉంది. నాడు కేంద్ర మంత్రిగా ఉన్న వెంకయ్యనాయుడు ఆ దస్త్రాన్ని ఆగమేఘాల మీద ముందుకు తీసుకెళ్లారు. దాంతో పాటు కేంద్రం నుంచి ప్రతినిధులు జిల్లాలో పర్యటించి మొగళ్ల పాలెం మైదానానికి సానుకూలంగా గుర్తించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన మైదానం నిర్మించేందుకు నెల్లూరుగ్రామీణ మండలం మొగళ్లపాళెంలోని 150 ఎకరాలు కావాలని అధికారులు గుర్తించారు. రూ. 8కోట్లతో కేంద్ర ప్రభుత్వం నిర్మించేందుకు ముందుకొచ్చింది. ఇది పూర్తయి అయిదేళ్లు గడుస్తోంది. ఇక్కడ బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, వాలీబాల్ తదితర క్రీడలకు సంబంధించిన మైదానాలు ఉన్నాయి. గత వైకాపా ప్రభుత్వం దీన్ని పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. శాప్ ఛైర్మన్ తొలుత ఇదే ఇండోర్ మైదానాన్ని పరిశీలించనున్నారు. ఆ తర్వాత ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో అధికారులతో మాట్లాడనున్నారు.

వీవోఏ చేతివాటం.. రూ.7 లక్షల స్వాహా


సమస్యను తెలుపుతున్న పొదుపు మహిళలు

మనుబోలు, న్యూస్‌టుడే: కూలీ పనులు చేసుకుంటూ కూడబెట్టిన నగదును పొదుపు రుణాలు చెల్లించేందుకు ఇవ్వగా వీవోఏ చేతివాటం ప్రదర్శించి స్వాహాచేసిన ఘటన వీరంపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన కొందరు పొదుపు మహిళలు ఉన్నతి, స్త్రీనిధి కింద తీసుకున్న రుణాలు చెల్లించగా, సుమారు రూ.7 లక్షలకు పైగా నగదును వీవోఏ బ్యాంకులో చెల్లించకుండానే స్వాహా చేయడంతో శుక్రవారం బాధిత మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి వివరాల మేరకు... వీరంపల్లి గ్రామానికి చెందిన భారతి మూడు నెలల క్రితం వరకు వీవోఏగా ఉన్నారు. గ్రామంలో 42 పొదుపు సంఘాలు ఉన్నాయని, వాటిలో 27 సంఘాల్లో ఉన్న కొందరు సభ్యులు ఉన్నతి, స్త్రీనిధి కింద ఒక్కొక్కరు సుమారు రూ.50 వేల రుణం తీసుకొని ప్రతి నెలా వీవోఏకు చెల్లిస్తున్నారు. రుణాలు చెల్లించలేదని బ్యాంకు అధికారులు 82 మందికి నోటీసులు జారీచేయడంతో అవాక్కయ్యారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణం మొత్తం చెల్లించిన నోటీసులు రావడంతో వీవోఏను నిలదీశారు. ఆమె బెదిరించడంతో వెలుగు ఏపీఎం దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

నవంబరు 10 నుంచి అగ్నివీర్ ఆర్మీ నియామక ర్యాలీ

రాయచోటి, న్యూస్‌టుడే : వైఎస్ఆర్ జిల్లా కడప డీఎస్ఏ స్టేడియంలో నవంబరు 10వ తేదీ నుంచి అగ్నివీర్ ఆర్మీ నియామక ర్యాలీ నిర్వహిస్తున్నామని ఆర్మీ నియామక అధికారి కల్నల్ పునీత్‌కుమార్ పేర్కొన్నారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, కార్యాలయ సహాయకులు, స్టోర్ కీపర్ టెక్నికల్, ట్రేడ్స్‌మెన్‌ల నియామకానికి దరఖాస్తులు చేసుకుని అడ్మిట్ కార్డులు పొందిన కర్నూలు, నెల్లూరు, అనంతపురం, వైఎస్ఆర్, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, నంద్యాల, బాపట్ల, పల్నాడు, తిరుపతి, అన్నమయ్య, సత్యసాయి జిల్లాల్లో అర్హులైన అభ్యర్థులు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని ఎవరు దళారులను నమ్మి మోసపోకూడదని వివరించారు.

విద్యార్థుల గూడు.. గోడు



ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు కనీస వసతులు కరవయ్యాయి. గత వైకాపా ప్రభుత్వం హాస్టళ్ల అభివృద్ధిని పట్టించుకోక ఎక్కడి సమస్యలు అక్కడే ఉండిపోయాయి. ముఖ్యంగా శిథిల భవనాల్లో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. వాడుక నీరు, మరుగుదొడ్లు, కిటికీలు సరిగా లేవు. రాత్రి వేళ దోమలతో సహవాసం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, ఆత్మకూరు, కావలి, దుత్తలూరు, కందుకూరు పట్టణం, వెంకటాచలం, కోవూరు

శిథిలావస్థలో భవనం



అనంతసాగరం మండలం రేవూరు సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహం శిథిలావస్థకు చేరింది. దాంతో విద్యార్థులు రాత్రివేళ ఉన్నత పాఠశాలలో తలదాచుకుంటున్నారు. భవనం గోడలు పటిష్ఠంగానే ఉన్నా.. స్లాబు పెచ్చులు ఊడి పడుతున్నాయి. స్లాబు తొలగించి నూతనంగా నిర్మిస్తే ఉపయోగపడుతుంది. ఇక్కడ వంద మంది విద్యార్థులు ఉండొచ్చు. గతంలో సీట్ల కోసం పోటీ ఉండేది. ప్రస్తుతం 70మందే ఉంటున్నారు.

దోమల బెడద



కావలి పట్టణంలోని బీసీ బాలుర వసతిగృహంలో 140 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఇక్కడి భవనం కిటికీలకు గతంలో ఏర్పాటు చేసిన దోమ తెరలు దెబ్బతిన్నాయి. దోమలు గదుల్లోకి వచ్చి కుడుతుండటంతో నిద్రకు భంగం కలుగుతోంది. మరుగుదొడ్ల నిర్వహణ సరిగాలేదు. తలుపులు దెబ్బతిన్నాయి. గతంలో ఇచ్చిన నీటి శుద్ధి యంత్రం పనిచేయడం లేదు.

అరకొర సౌకర్యాలు



నర్రవాడ ఎస్సీ వసతిగృహంలో 42 మంది చదువుతున్నారు. ఎన్నో ఏళ్ల క్రితం వసతి గృహాన్ని నిర్మించడంతో గదులు శిథిలావస్థకు చేరాయి. మొత్తం ఎనిమిది గదులు ఉండగా.. మూడు వినియోగించుకోలేని పరిస్థితి ఉండటంతో మూసి వేశారు. మిగిలిన గదుల్లోనే విద్యార్థులు ఉంటున్నారు. వాటికి కూడా సక్రమంగా కిటికీలు, తలుపులు లేక అవస్థలు పడుతున్నారు.

నీటి వసతి లేక ఆరుబయటకే..



కందుకూరు పట్టణం విక్కిరాలపేట రోడ్డులో ఉన్న ప్రభుత్వ బీసీ వసతిగృహం భవనం శిథిలావస్థలో ఉంది. కిటికీ తలుపు ఊడిపోయాయి. స్లాబు పెచ్చులు ఊడి ప్రమాదకరంగా ఉంది. ప్రస్తుతం 45 మంది విద్యార్థులు ఉంటున్నారు. గతంలో ఉన్న మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరగా.. నూతనంగా పది నిర్మించారు. ప్రస్తుతం వాటికి పైపులైన్లు అమర్చక నీటి సౌకర్యం లేదు. విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకోడానికి ఆరుబయటకు వెళుతున్నారు. కిటికీలకు దోమతెరలు అమర్చక దోమల బెడదతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. వసతుల కల్పనకు త్వరలో నిధులు మంజూరవుతాయని.. వెంటనే పనులు చేయిస్తామని వార్డెన్ రత్నాకర్ తెలిపారు.

గోడలకు పగుళ్లు



కోవూరు పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో 13 గదులు ఉన్నాయి. 9 గదుల్లో వంద మంది విద్యార్థులు ఉంటున్నారు. కుడివైపు గదుల గోడలకు పగుళ్లు రావడంతో బిక్కుబిక్కుమంటూ చదువుకుంటున్నారు. కిటికీలకు మెష్ లేక దోమల బెడదతో విద్యార్థులు అల్లాడిపోతున్నారు.

ఇరుకు గదులు

వెంకటాచలంలోని బీసీ సంక్షేమ వసతి గృహంలో 48 మంది విద్యార్థులు ఆరు ఇరుకు గదుల్లో ఉంటున్నారు. రెండు గదులకు పైకప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. వర్షాలకు ఉరుస్తోంది. ఆరు మరుగుదొడ్లు ఉండగా.. రెండే ఉపయోగంలో ఉన్నాయి.



హెర్బాలైఫ్ కంపెనీకి జరిమానా



నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: తమ సంస్థ ఉత్పత్తి చేసిన హెల్త్ ప్రొడక్ట్‌తో బరువు పెరుగుతుందని బాధితుడిని నమ్మించి మోసం చేసిన హెర్బాలైఫ్ కంపెనీకి శుక్రవారం ఉమ్మడి నెల్లూరు జిల్లా వినియోగదారుల కోర్టు న్యాయమూర్తి జింకా రెడ్డిశేఖర్ రూ.29,056.78 జరిమానా విధించారు. వివరాల్లోకి వెళితే... తమ సంస్థ ఉత్పత్తి చేసిన హెల్త్ ప్రొడక్ట్‌తో బరువు పెరుగుతారని హెర్బాలైఫ్ కంపెనీకి చెందిన కావలి అసోసియేట్.. అదే పట్టణానికి చెందిన ఉప్పు వినయ్‌కుమార్‌ను నమ్మించడంతో బాధితుడు రూ.8,131.96 ఇచ్చి ప్రొడక్ట్ కొనుగోలు చేశాడు. దాన్ని వాడటంతో బరువు పెరుగుదలకు బదులు బాధితుడు బరువు తగ్గడంతో కంపెనీని సంప్రదించగా రూ.924.82 తీసుకుని మళ్లీ వేరే రకం పదార్థం ఇచ్చారు. అయినా ఫలితం లేకపోవడంతో బాధితుడు వినియోగదారుల కోర్టును ఆశ్రయించాడు. కేసు విచారించిన న్యాయమూర్తి జింకా రెడ్డిశేఖర్ బాధితుడి నుంచి వసూలు చేసిన రూ.9,055.78, మానసిక ఆవేదనకు రూ.15 వేలు, కోర్టు ఖర్చులకు రూ.5వేలు మొత్తం రూ.29,056.78లు తీర్పు వెలువడిన 45 రోజుల్లోగా చెల్లించాలని హెర్బాలైఫ్ కంపెనీని ఆదేశించారు. తీర్పు కార్యక్రమంలో సభ్యురాలు బాలసుధ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తాం

విడవలూరు, న్యూస్‌టుడే: తుపాను, వరదలకు నష్ట పోయిన రైతులకు ప్రభుత్వం సాయమందిస్తోందని జేడీఏ సత్యవాణి అన్నారు. మండల పరిధిలోని ముదివర్తిలో ఇటీవల వర్షాలకు గుండుబోయిన వెంకటేశ్వర్లు అనే రైతు పొలం ముంపునకు గురై దెబ్బతింది. బాధిత రైతు పొలాన్ని శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామన్నారు. అనంతరం రామచంద్రాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య, ఎంపీఈవో సాయిలక్ష్మి పాల్గొన్నారు.


ముదివర్తిలో రైతుతో మాట్లాడుతున్న జేడీఏ సత్యవాణి

పురుగు మందులు అధికంగా వినియోగించొద్దు


దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఆత్మ పీడీ శివనారాయణ

అనంతసాగరం, న్యూస్‌టుడే: సాగులో పురుగు మందులు అధికంగా వినియోగిస్తే ప్రకృతి సమతుల్యత దెబ్బతిని భవిష్యత్తులో పురుగులు, తెగుళ్ల ఉద్ధృతి పెరుగుతుందని జిల్లా ఆత్మ పీడీ శివనారాయణ పేర్కొన్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కొమ్మలేరు వాగు పొంగి కచిరదేవరాయపల్లి గ్రామంలో ప్రభావితమైన వరిపంటను కృషి విజ్ఞాన్ కోఆర్డినేటర్ డాక్టర్ శివజ్యోతితో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. మినగల్లు, రేవూరు గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు సూచనలు సలహాలు అందించారు.

దిగజారిన పునాస ధరలు


పునాస మామిడి కాపు

ఉలవపాడు, న్యూస్‌టుడే: పునాస మామిడి ధరలు దిగజారాయి. ఉలవపాడు మార్కెట్‌లో వర్షాలకు ముందు టన్ను రూ.65వేల నుంచి రూ. 70వేల వరకు పలికిన ధరలు.. ఇప్పుడు రూ. 45వేలకు పతనమయ్యాయి. దాంతో రైతులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. దీనికి తోడు వర్షాలు పడటంతో పూత, పిందెలు దెబ్బతిన్నాయని చెబుతున్నారు. ఈ క్రమంలో దిగుబడి కూడా తగ్గనుందని వాపోయారు. ఉలవపాడు మార్కెట్ నుంచి పునాస కాయలు రాష్ట్రంలోని వివిధ పట్టణాలకు ఎగుమతి అవుతున్న విషయం తెలిసిందే.

నారీమణులు.. ప్రాణదాతలు



న్యూస్‌టుడే, విడవలూరు

గ్రామీణ ప్రాంతాల్లో నారీమణులు సేవా కార్యక్రమాల్లో విస్తృతంగా భాగస్వాములవుతున్నారు.. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు సకాలంలో రక్తమందక పలువురు మృత్యువాత పడుతున్నారు... వీరికి సకాలంలో మెరుగైన వైద్యసేవలతో పాటు రక్తం అందుబాటులోఉంటే మృత్యువు నుంచి బయటపడుతున్నారు.. ఇది గమనించిన విడవలూరుకు చెందిన యువతులు పలుమార్లు రక్తదానం చేస్తూ ప్రాణదాతలుగా నిలుస్తున్నారు.. ఆపదలో ఉన్నవారికి మేము సైతం అంటూ ఒకటి కాదు.. రెండు కాదు పలుమార్లు రక్తదానం చేయడంతో రెడ్‌క్రాస్ నుంచి ప్రశంసలు, ప్రముఖుల నుంచి అవార్డులు అందుకున్నారు.

12 సార్లు రక్తదానం చేశా



ఎంబీబీఎస్ మూడో ఏడాది చదువుతున్నా. ఇప్పటికి 12 సార్లు రక్తదానం చేశా. అపోహలు వీడి యువత ముందుకు రావాలి. అనేక మంది సరైన సమయంలో వారికి రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు ఎక్కువగా ఉన్నాయి. సమాజానికి నావంతు బాధ్యతగా రక్తదానం చేస్తున్నా. పలువురికి అవగాహన కల్పిస్తున్నా.

– సీహెచ్ వినీల, ఎంబీబీఎస్ మూడో సంవత్సరం

యువతకు అవగాహన కల్పించాలి



ఆపదల్లో ఉన్న వారికి రక్తదానం చేయడం ఎంతో సంతృప్తినిస్తుంది. పురుషులతో పాటు మహిళలు రక్తదానం చేయవచ్చని ముందడుగు వేశా. ఇప్పటికి 6 సార్లు ఇచ్చా. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మందికి రక్తదానంపై అవగాహన కల్పిస్తే ఎక్కువ మందికి ప్రయోజనం చేకూరుతుంది.

- బి.కల్యాణి, పీజీ విద్యార్థిని

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాము ధర:	రూ. 7,451
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 59,608
వెండి గ్రాము :	రూ. 98.00

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	129
రిటైల్	151
లేయర్	120
బ్రాయిలర్స్	219
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	249
లేయర్ మాంసం	204
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	140
లేయర్	115
బ్రాయిలర్స్	250
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	276
లేయర్ మాంసం	195

కావలి

•కావలి • ఉదయగిరి • కందుకూరు

లైసెన్సులు లేకుండా అమ్మకాలు చేస్తే చర్యలు

వరికుంటపాడు, న్యూస్‌టుడే: దుకాణాలు నిర్వహించే యజమానులు ప్రభుత్వం నుంచి తప్పనిసరిగా లైసెన్సు పొంది ఉండాలని నెల్లూరు డివిజన్ ఫుడ్ సేఫ్టీ అసిస్టెంటు కంట్రోలర్ నీరజ అన్నారు. వరికుంటపాడులో శుక్రవారం పలు దుకాణాలను తనిఖీ చేశారు. వినియోగదారుల ఫోరం సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి వస్తువు తయారీ, గడువు ముగింపు తేదీలను చూసిన తరువాత మాత్రమే వినియోగదారుడికి అమ్మాలన్నారు. బస్టాండు కూడలిలో లైసెన్సు లేకుండా దుకాణం నిర్వహిస్తున్న ఇద్దరికి నోటీసులు అందజేశారు. మరొక దుకాణంలో గడువు ముగిసిన వస్తువులను గుర్తించి ఆ యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

వంద శాతం పన్నుల వసూలే లక్ష్యం



సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో మాట్లాడుతున్న కమిషనర్ అనూష

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: మున్సిపాలిటీ పరిధిలో ఇంటి, ఖాళీ స్థలాల పన్నులు వంద శాతం వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.అనూష తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సచివాలయాల అడ్మిన్లతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి సంబంధించి వెంటనే పన్నులు వసూలు చేయాలని, చెల్లించని వారి కుళాయి కనెక్షన్ తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పేదలకు ప్రభుత్వ సాయం అందించాలి



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

కావలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పలు కాలనీల్లో నీరు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్న పేదవారికి ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని సీపీఎం నాయకులు పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య కోరారు. ఆ మేరకు ఆర్డీవో వంశీకృష్ణకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. నిత్యావసర సరకులు, సామగ్రి పూర్తిగా తడిసిపోవడంతో తిండికి కూడా తీవ్రంగా అవస్థలు పడ్డారన్నారు. కుటుంబ పోషణ కూడా ఇబ్బందులుగా ఉన్న ప్రతి కుటుంబానికి రూ.25వేలు నగదు, 50 కేజీల బియ్యం, సరకులు ఇవ్వాలన్నారు. సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు వై.కృష్ణమోహన్, నాయకులు మధుసూదనరావు, తిరుపాలు, బాబురావు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆ బడిలో పునరావాసం కొనసాగింపు

కావలి, న్యూస్‌టుడే: రామ్మూర్తిపేటలోని పురపాలక ప్రాథమిక పాఠశాలకు శుక్రవారం కూడా సెలవు ప్రకటించారు. గత 15 రోజులుగా దసరా, భారీవర్షాల కారణంగా సెలవులు వచ్చాయి. పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మందాటి చెరువు వద్ద వరద బాధితులుండటంతో శుక్రవారం కూడా సెలవు అమలైంది. ఈ విషయమై కావలి ఆర్డీవో ఎం.వంశీకృష్ణ మాట్లాడుతూ అవసరమైతే మరే క్కడైనా బాధితులకు పునరావాసం కల్పిస్తామన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

పేదల ఇంటి బిల్లులకు మోక్షం

ఎన్టీఆర్ గృహ కల్ప పథకం లబ్ధిదారులకు ఊరట



కందుకూరులో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం



తెదేపా ప్రభుత్వ హయాంలో 2014-19 మధ్య కాలంలో ఎన్టీఆర్ గృహ కల్ప పథకం కింద ఇళ్లు నిర్మించుకున్న పేదలకు కూటమి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. నాడు ఇళ్ల నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులకు గత వైకాపా ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా నిలిపివేసింది. దీంతో బిల్లుల కోసం అయిదేళ్ల పాటు గృహనిర్మాణశాఖ కార్యాలయాల చుట్టూ తిరిగాల్సిన పరిస్థితి కల్పించింది. కూటమి ప్రభుత్వం రాకతో వీరి ఇబ్బందులు తొలిగిపోనున్నాయి. ఇటీవల సంబంధిత అధికారుల బృందం సర్వే నిర్వహించి, నివేదికలను ప్రభుత్వానికి పంపించారు. త్వరలోనే లబ్ధిదారుల ఖాతాల్లో పెండింగ్ బిల్లులు జమ కానున్నాయని అధికారులు చెబుతున్నారు.

3339 ఇళ్లు మంజూరు

గత తెదేపా ప్రభుత్వ హయాంలో కందుకూరు నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో నివేశ స్థలాలు ఉండి పక్కా గృహాలు లేని వారిని గుర్తించారు. అందులో 3339 మందిని అర్హులుగా తేల్చారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం తరుపున రూ. 2.5లక్షలు మంజూరు చేశారు. అందులో 295 మంది నేటికీ నిర్మాణం ప్రారంభించలేదు. 764 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. వారికి గత వైకాపా ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఇంటి నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారుల వివరాలపై పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించింది. నాడు ఇళ్లు నిర్మించుకున్న వారు, వివిధ దశల వరకు నిర్మాణం చేసినవారు, పూర్తయినా బిల్లులు రాని వారు, గతంలో అర్హులుగా ఉన్నా. అనంతరం అనర్హులుగా ప్రకటించబడ్డ వారు ఇలాంటి వివరాలను అధికారులు సేకరించారు. మొత్తం మీద నియోజకవర్గంలో రూ. 4.33కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉందని గుర్తించారు.

మండలం	ఇళ్లు మంజూరు	ప్రారంభం కానివి	పూర్తి	రావాల్సిన బిల్లులు(రూ.కోట్లల్లో)
గుడ్లూరు	661	41	235	1.22
కందుకూరు	582	95	53	0.52
లింగసముద్రం	618	90	60	0.395
ఉలవపాడు	842	36	250	1.35
వలేటివారిపాలెం	636	33	166	0.85

సర్వే పూర్తయింది

ప్రభుత్వ ఆదేశాల మేరకు కందుకూరు నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో ఎన్టీఆర్ గృహ కల్ప పథకం కింద వివిధ దశల్లో ఉన్న ఇంటి నిర్మాణాలు, లబ్ధిదారుల వివరాలను సర్వే చేసి సేకరించాం. ఉన్నతాధికారులకు పంపాం. త్వరలోనే వారి ఖాతాల్లో బిల్లులు జమ అవుతాయి.

- శ్రీనివాసరావు, డీఈ, గృహనిర్మాణశాఖ

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: మోపాడు ప్రధాన రహదారిలో వీధి దీపాలు వెలగటం లేదు. - **స్థానికుడు**

సమాధానం: పరిశీలించి మరమ్మతులు చేయిస్తాను. - **సుధాకర్, గ్రామకార్యదర్శి**

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే

? ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే మార్గంలో వ్యర్థాలు వేస్తున్నారు. - **తరుణ్‌సాయి**

✓ వ్యర్థాలను తొలగిస్తాం. - **చంద్రశేఖర్,పంచాయతీ కార్యదర్శి - గుడ్లూరు, న్యూస్‌టుడే**

? ఉలవపాడులోని పాత రైల్వేరోడ్డుతోపాటు పలు ప్రాంతాల్లో వీధిదీపాలు సక్రమంగా వెలగడంలేదు. - **ప్రసాదు, ఉలవపాడు**

✓ **సమాధానం:** పరిశీలించి మూడు రోజుల్లో వెలిగించే ఏర్పాటు చేయిస్తాను. - **వీరయ్య, పంచాయతీ కార్యదర్శి - ఉలవపాడు**

చెరువుల మరమ్మతుకు ప్రతిపాదనలు

వింజమూరు : మండలంలో 12 చెరువుల మరమ్మతులకు రూ. 90 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు వింజమూరు సెక్షన్ 1, 2 ఏఈలు మహేంద్ర, శ్రీనివాసులు తెలిపారు. ఒకటో సెక్షన్ పరిధిలో ఎ.కిస్తీపురం, చంద్రపడియ, రామలింగారెడ్డిపల్లి, రెండో సెక్షన్ పరిధిలో చాకలకొండ, బత్తినవారిపల్లి, ఊటుకూరు చెరువులు ఉన్నట్లు తెలిపారు.

పగలే వెలుగులు



దుత్తలూరు పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో వీధి దీపాలు రాత్రి పగలు తేడా లేకుండా వెలుగుతున్నాయి. వీటిని నియంత్రించే ఏర్పాటు చేయకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. నిరంతరాయంగా దీపాలు వెలుగుతుండటంతో విద్యుత్తు వృథా ఎక్కువవుతుందని స్థానికులు చెబుతున్నారు. ఈవిషయమై పంచాయతీ కార్యదర్శి నజీముల్లాను వివరణ కోరగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. - **న్యూస్‌టుడే, దుత్తలూరు**

కాలువ నిండా పిచ్చిమొక్కలే!

పట్టణంలోని విప్పగుంటరోడ్డులో మురుగు కాలువ పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండింది. నీరు పారుదలకు అడ్డంకిగా మారింది. నీరు నిలిచిపోవడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ కె.అనూష మాట్లాడుతూ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువ శుభ్రం చేయిస్తామన్నారు. - **న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం**



గుంతల పూడ్చివేత

స్పందనకు వందనం



జాతీయ రహదారి 567బీజీ- కలిగిరి మెయిన్‌రోడ్డుపై వాటర్‌ట్యాంకు ఎదురుగా ఏర్పడిన భారీ గుంతలను గుత్తేదారు పూడ్పించారు. ఈ రోడ్డుపై ఏర్పడిన గుంతలతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై బుధవారం ప్రమాదాలు జరుగుతున్నా పట్టదా..? అనే శీర్షికన ఈనాడులో కథనం ప్రచురితమైంది. దీనిపై ఎన్‌హెచ్ అధికారులు, గుత్తేదారులు స్పందించారు. కంకర మిశ్రమంతో పూడ్పించారు. శాశ్వత మరమ్మతులు చేయిస్తే మేలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. **న్యూస్‌టుడే, కలిగిరి**

చెరువుకు నీరు చేరేదెట్టా?

అటవీ ప్రాంతంలో కురిసిన వర్షపు నీరు చిన్నచెరువుకు చేరడం లేదని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగనన్న లేఅవుట్ నిర్మాణం సమయంలో రహదారి కోసం ఒరవను పూడ్చివేశారు. దిగువ భాగంలో ఒరవ ఆక్రమణలకు గురైంది. దీంతో భారీ వర్షాలు కురిసినా చెరువుకు నీరు రావడం లేదు. ఈ చెరువు కింద సుమారు 200 ఎకరాల ఆయకట్టు ఉంది. ఒరవక ఆక్రమణలు తొలగించి నీటి ప్రవాహానికి సక్రమంగా ఉంచాలని రైతులు కోరుతున్నారు. **న్యూస్‌టుడే, గుడ్లూరు**



రెప్పకొడితే ముప్పే



బోగోలులోని రైలు గేటుకు పడమర ఒక కిలోమీటరు పరిధిలో ఉన్న ర.భ రోడ్డు ఇది. అంచులు మెరక, రోడ్డు పల్లంగా ఉండడంతో చిన్న వర్షం పడినా గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు రాకపోకలు చేయడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. రెప్పపాటు ఆదమరిచిన ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఈ విషయమై కావలి ర.భ ఈఈ రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. పరిశీలించి మరమ్మతులకు చేపడతామన్నారు. - **న్యూస్‌టుడే, బిట్రగుంట**

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మహేంద్రనాయక్

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆటో అదుపు తప్పి బోల్తాకొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం మండల పరిధిలో చోటుచేసుకుంది. గ్రామీణ ఎస్సై మహేంద్రనాయక్ తెలిపిన వివరాల మేరకు పాలూరు నుంచి కందుకూరు పట్టణానికి ప్రయాణికులతో వస్తున్న ఆటో దొండపాడు సమీపంలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఎం.లక్ష్మయ్య(60) మరణించగా, ముగ్గురు మహిళలకు స్వల్పగాయాలయ్యాయి. మృతదేహాన్ని శవపంచనామాకు తరలించి, కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటో చోరీ.. కేసు నమోదు

జలదంకి, న్యూస్‌టుడే: ఇంటి ముందు ఉంచిన ఆటో చోరీకి గురైన సంఘటన జమ్మలపాలెంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పసుపులేటి మాలకొండయ్య తన ఆటోను రోజు మాదిరిగా రాత్రి సమయంలో ఇంటి ముందు పెట్టారు. గురువారం ఉదయం నిద్ర లేచి చూడగా కనిపించలేదు. పలు చోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో బాధితుడు తన ఆటోను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారంటూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ఉదయగిరి, న్యూస్‌టుడే: హౌసింగ్ లేఅవుట్లలో ఆప్షన్-1,2 కింద ఇళ్ల నిర్మాణాలు చేస్తున్న లబ్ధిదారులు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని హౌసింగ్ డీఈఈ దయాకర్ పేర్కొన్నారు. మండలంలోని శకునాలపల్లి, పుల్లాయపల్లి గ్రామాల్లో నిర్మాణాల్లో ఉన్న పక్కాగృహాలను శుక్రవారం పరిశీలించి లబ్ధిదారులకు సూచనలిచ్చారు. అనంతరం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఇంజినీరింగ్, ఉపాధిహామీ, వెలుగు సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఉపాధి పథకం కింద గృహ నిర్మాణాలు చేసుకొనే లబ్ధిదారులకు 90 రోజుల పనిదినాల నగదును త్వరితగతిన అందించాలన్నారు. లబ్ధిదారుల్లో పొదుపు గ్రూపుల్లో కొనసాగే సభ్యులైతే వారికి రూ. 35 వేలు రుణం ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీడీవో అప్పాజీ, హౌసింగ్ ఏఈ రామకృష్ణ, ఏపీఎం ఖాజారంతుల్లా, ఏపీవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు వినతి



శివశంకర్‌తో జనసేన కావలి బాధ్యుడు సుధాకర్

కావలి, న్యూస్‌టుడే: కావలి నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని జనసేన పార్టీ కావలి నియోజకవర్గ బాధ్యుడు అళహరి సుధాకర్ కోరారు. శుక్రవారం ఎంఎస్ఎంఈ రాష్ట్ర ఛైర్మన్ తమ్మిరెడ్డి శివ శంకర్‌ను విజయవాడలో శుక్రవారం కలిశారు. సమీపంలోనే రామాయపట్నం ఓడరేవు కోలువుదీరుతుండగా దానికి అనుబంధంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున వివిధ పరిశ్రమల ఏర్పాటు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

బిట్రగుంట, న్యూస్‌టుడే : బోగోలు మండలంలో శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నాలుగు గంటలపాటు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డిస్కం ఏఈ జడరాయ ఒక ప్రకటనలో తెలిపారు. చెంచులక్ష్మీపురం ముంగమూరు వడ్డీపాలెంలో ఉన్న సబ్‌స్టేషన్లు నిర్వహణ కారణంగా అంతరాయం ఏర్పడుతున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జాతీయ రహదారి.. నాణ్యత ఏదీ?

రెండు నెలలకే పగుళ్లు



జలదంకి సమీపంలో పగుళ్లిచ్చిన జాతీయ రహదారి

న్యూస్‌టుడే, జలదంకి

కొన్ని దశాబ్దాల పాటు ఎంతో నాణ్యతగా ఉండాల్సిన జాతీయ రహదారి వేసిన రెండు నెలలకే నిట్ట నిలువున పగుళ్లిచ్చింది. రోడ్డు మార్జిన్ సైతం పలు చోట్ల కోతకు గురై ప్రమాదకరంగా మారింది. కావలి పట్టణం నుంచి దుత్తలూరు మీదుగా కడప, బెంగళూరుకు నిత్యం లక్షలాది వాహనాలు రాకపోకలు సాగించే ఎన్‌హెచ్167 జాతీయ రహదారిపై తరుచుగా ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రభుత్వం నాలుగు వరుసలుగా విస్తరించేందుకు చర్యలు తీసుకుంది. కావలి నుంచి దుత్తలూరు వరకు 66.9 కి.మీ. మేర రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు అంచనా విలువ రూ. 423.66 కోట్లు నిధులు మంజూరు చేసింది.

ఈ జాతీయ రహదారి విస్తరణ పనులను 2022 జులైలో ప్రారంభించారు. 2024 లోపు పూర్తి చేయాల్సి ఉన్నా నేటికీ అసంపూర్తిగానే మిగిలాయి. ప్రస్తుతం పనులు జరుగుతున్న జలదంకి, జమ్మలపాలెం గ్రామాల మధ్యలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పగలటంతో పాటు మార్జిన్ సైతం కుంగి, కోతకు గురై ప్రమాదకరంగా మారింది. దీంతో వాహన చోదకులు బెంబేలెత్తుతున్నారు.

రోడ్డు విస్తరణకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపడంతో సమస్య తీరిందన్న ఆనందం ప్రజలకు మూణాళ్ల ముచ్చటగా మారింది. పనుల్లో నాణ్యత లోపించిందంటూ పలువురు ఆరోపిస్తున్నారు. నేషనల్ హైవే ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు. ఈ విషయమై జాతీయ రహదారి డీఈ నాగిరెడ్డి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పగిలిన రోడ్డును పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.



కోతకు గురైన రోడ్డు మార్జిన్

జాగ్రత్తలు పాటించాలి



ఉదయగిరిలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఇంద్రసేనారెడ్డి

కావలి గ్రామీణం,న్యూస్‌టుడే: యువతి, యువకులు వాహనలు నడిపే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామీణ సీఐ జి.రాజేశ్వరరావు పేర్కొన్నారు. మండల పరిధిలని రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు, డ్రైవింగ్ లైసెన్సులపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనం నడిపేసమయంలో హెల్మెట్ తప్పకుండా ధరించాలన్నారు. మండల పరిధిలోని రుద్రకోట, గౌరవరం గ్రామాల జాతీయ రహదారిపై బ్లాక్‌స్పాట్స్ గుర్తించి ప్రమాదాల జరగకుండా నియంత్రికలు డ్రమ్ములు ఏర్పాటు చేయడం జరిగిందని సీఐ తెలిపారు. ఎస్సైౖ తిరుమలరెడ్డి, బాజీబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయగిరి, కందుకూరు పట్టణం: ద్విచక్రవాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ట్యాంకుబండ్ కూడలిలో శుక్రవారం హెల్మెట్ ధరించాల్సిన ఆవశ్యకతపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే నిండు ప్రాణాలు బలైపోతాయని పట్టణ ఎస్ఐ వి.సాంబశివయ్య అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహ కూడలిలో వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు.



కందుకూరులో సూచనలు చేస్తున్న ఎస్సై సాంబశివయ్య

తెదేపాతోనే పల్లెల అభివృద్ధి

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి తెదేపాతోనే సాధ్యమని మండల పార్టీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం అన్నారు. పల్లె పండగలో భాగంగా చుండి, అంకభూపాలపురం, కలవళ్ల గ్రామాల్లో సీసీరోడ్లు, గోకులం షెడ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పంచాయతీల నిధులను దారి మళ్లించిందని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీ ఖాతాలకు జమ చేస్తోందన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

వింజమూరు, న్యూస్‌టుడే: ఊటుకూరు పంచాయతీ పరిధిలోని జువ్విగుంటపాలెంలో శుక్రవారం స్థానిక నాయకులు సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా 237 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 8.80 లక్షలు మంజూరయ్యాయి. కార్యక్రమంలో తెదేపా నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, గురజాల వెంకటరమణయ్య, రొడ్డా కొండయ్య, కె.వెంకటేశ్వర్లు, ఎ.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల బాధ్యతల స్వీకరణ

లింగసముద్రం, న్యూస్‌టుడే: రాళ్లపాడు జలాశయం పర్యవేక్షణకు ప్రభుత్వం వెంకటేశ్వరరావు, మధుసూదనరావులను డీఈలుగా నియమించింది. వారు గురువారం విధుల్లో చేరారు. వెంకటేశ్వరరావు సంతనూతలపాడు నుంచి, మధుసూదనరావు అద్దంకి నుంచి బదిలీపై వచ్చారు.

సీతారామపురంలో అవగాహన ర్యాలీ



ర్యాలీలో ఎంఈవో, ఉపాధ్యాయులు

సీతారామపురం, న్యూస్‌టుడే: మండల విద్యావనరుల కేంద్రం వద్ద నుంచి బస్టాండ్ కూడలి వరకు డిస్లెక్సీయపై అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో మస్తాన్‌వలి మాట్లాడుతూ డిస్లెక్సీయ అనేది ఒక రకమైన అభ్యసన వైకల్యమన్నారు. ఈ సమస్య ఉన్నవారు పదాలు, సంఖ్యల ఉచ్చారణలోనూ అర్థం చేసుకోవడంలోనూ ఇబ్బందులు పడుతుంటారన్నారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, తిరుపతయ్య, సీఆర్పీలు, ఐఈఆర్టీ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్యం ముఖ్యం



ప్రసంగిస్తున్న జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీమాధవి

ఉదయగిరి, న్యూస్‌టుడే: పంటల సాగులో రైతులు ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించేలా వ్యవసాయ సహాయకులు అవగాహన కల్పించాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీమాధవి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త విజయకుమార్ నాయక్ తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో శుక్రవారం ఉదయగిరి వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల వ్యవసాయ సహాయకులకు సామర్థ్య పెంపుపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంటల సాగులో సేంద్రియ ఎరువుల వాడాకాన్ని పెంచేలా చూడాలన్నారు. ఏడీఏ చెన్నారెడ్డి, ఏవోలు చక్రవర్తి, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొగిలిచర్లలో వైద్య శిబిరం

లింగసముద్రం, న్యూస్‌టుడే: మొగిలిచర్లలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. 136 మందికి వివిధ రకాల వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేసినట్లు డాక్టర్ రమేష్ తెలిపారు. అనంతరం మందులు అందజేశారు. వైద్యులు శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పటి పాపం.. ఇప్పుడు శాపం



బోగోలులో ఇంటి చుట్టూ వర్షపునీరు

న్యూస్‌టుడే, బిట్రగుంట

పేదవారి సొంతింటి కలను నిజం చేస్తామంటూ గత వైకాపా ప్రభుత్వం చేసిన ఆర్భాటం అంత ఇంత కాదు. జగనన్న కాలనీల పేరిట నివాసయోగ్యం కాని ప్రదేశాల్లో లేఅవుట్లు వేసింది. మౌలిక సౌకర్యాలు కల్పించకుండా లబ్ధిదారులకు అందజేసి చేతులు దులుపుకొంది. అప్పటి పాపం..ఇప్పుడు లబ్ధిదార్ల పాలిట శాపంగా మారింది.

బోగోలు, విశ్వనాథరావుపేట పెద్ద పంచాయతీల లేఅవుట్లల్లో పల్లంగా ఉన్న భూముల్ని మెరక చేసే పనుల్లోనూ.. మాయాజాలం జరిగింది. రోడ్ల నిర్మాణం కూడా మొక్కుబడిగా సాగింది. ఈ గ్రామాల్లో వేసిన అయిదు లేఅవుట్లు మెరక చేసే పనులు మమ అనిపించారు. రోడ్ల నిర్మాణంలో కూడా నిబంధనలు పాటించలేదు. ఫలితంగా వర్షాలు కురిసినప్పుడల్లా బోగోలులోని మూడు లేఅవుట్లలో అక్కడక్కడ ఇళ్ల చుట్టూ నీరు చేరుతుంది. దీంతో లబ్ధిదారులకు అవస్థలు తప్పడం లేదు. రోజుల తరబడి నీరు నిల్వ ఉండడం వల్ల ఇళ్లకు ముప్పు పొంచి ఉందని ఆందోళనకు గురవుతున్నారు.

మురుగు కాలువలు లేవు

డ్రైనేజీ సౌకర్యం అయినా ఏర్పాటు చేసి ఉంటే ఈ సమస్య నుంచి విముక్తి కలిగి ఉండేదంటున్నారు. ఇంకుడు గుంతలు కూడా నీళ్లల్లోనే ఉండిపోయే దుస్థితి దాపరించింది. అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. కొన్ని చోట్ల నడిచి వెళ్లేందుకు అసౌకర్యంగా ఉంది. తహసీల్దారు కార్యాలయం వెనుక ఉన్న లేఅవుట్‌లో నీటి సౌకర్యం లేదు. ఇళ్ల నిర్మాణం చేపట్టాలంటే అదనపు భారం మోయలేకపోతున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు లేఅవుట్లలో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



కాలనీలో రోడ్ల దుస్థితి

ఇబ్బందుల్లేకుండా చూస్తాం: మాధవరావు, ఈఈ, గృహ నిర్మాణశాఖ

గృహ నిర్మాణాల్లో జరిగిన అవకతవకలపై ఇటీవల విజిలెన్స్ అధికారులు విచారణ చేశారు. ప్రభుత్వానికి నివేదించారు. లబ్ధిదారులందరూ ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తే సిమెంట్ రోడ్లు, మురుగునీటి కాలువలు ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇళ్ల నిర్మాణం చేపట్టేవారికి నీటి ఇబ్బంది ఉంటే సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: మండలంలోని నరసాపురంలోని ఎంవీఆర్‌ఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని శ్రీతేజ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ముజీర్ తెలిపారు. నవంబరు 9 నుంచి 11వ తేదీ వరకు బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో నెల్లూరు జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు. నెల్లూరులో ఏసీ సుబ్బారెడ్డి క్రీడాప్రాంగణంలో జరిగిన అండర్-14 బాలికల విభాగంలో నరసాపురం విద్యార్థినులు రెండో స్థానంలో నిలిచారు. అత్యంత ప్రతిభ చూపిన శ్రీతేజ పోటీలకు ఎంపికవడంతో శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

పూడికతీత పనులు ముమ్మరం

విడవలూరు, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి రైతుల పక్షపాతి అని రామతీర్థం, వీరారెడ్డిపాలెం చివరి ఆయకట్టు రైతులు అన్నారు. వీరారెడ్డిపాలెంలో రైతులు శుక్రవారం మాట్లాడుతూ.. గత వైకాపా ప్రభుత్వం పంట కాలువల పూడికతీత పనులు చేపట్టలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన


వీరారెడ్డిపాలెంలో మాట్లాడుతున్న రైతులు

తర్వాత రైతులు కోరిన వెంటనే ఎమ్మెల్యే సొంత నిధులతో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ప్రొక్లెయిన్‌ను ఏర్పాటు చేసి కాలువలు పూడిక తీయించారని వివరించారు. కాలువలు పూడిక తీయకపోతే ఇటీవల కురిసిన వర్షాలకు రైతుల పొలాలు ముంపునకు గురై తీవ్రంగా నష్టం వాటిల్లేదని వివరించారు. రైతులు తుళ్లూరు మాధవ్, తాతా రమేష్, నాటారు విజయ్‌కుమార్, నాగేంద్ర, ఉప్పాల వెంకటరమణయ్య, రఘు, తిరుపతి, శీను తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి

మనుబోలు, న్యూస్‌టుడే : క్షయ నిర్మూలనకు కృషి చేయాలని అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేసి పలు దస్త్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌ను నూరుశాతం పూర్తి చేయాలన్నారు. ఇమ్యునైజేషన్ కార్యక్రమం ద్వారా గర్భిణులు, పిల్లలకు వ్యాధినిరోధక టీకాలను తప్పక వేయాలన్నారు.

పసుపు రిబ్బన్లతో విధులకు హాజరు

చేజర్ల, న్యూస్‌టుడే: ఒప్పంద ప్రాతిపదికన ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న వారిని 114 జీవో ప్రకారం క్రమబద్ధీకరించాలని కోరుతూ అధ్యాపకులు శుక్రవారం పసుపు రిబ్బన్లతో విధులకు హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక కళాశాల ఎదుట నిరసన తెలిపారు.

జనావాసాల్లో మద్యం దుకాణాలా?

సత్వరం తొలగించాలని మహిళల ఆందోళన



కోవూరు పట్టణ పరిధిలోని పెళ్లకూరు కాలనీలో నివాసాల నడుమ మద్యం దుకాణం ఉండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలో న్యాయస్థానం, తహసీల్దారు, ఎంపీడీవో, వ్యవసాయ, గృహనిర్మాణశాఖ, ట్రెజరీ, సబ్ రిజిస్ట్రార్, వెలుగు, పోలీసు స్టేషన్‌తో పాటు బాలికల జడ్పీ ఉన్నత పాఠశాల, మరో నాలుగు బాల బాలికల సంక్షేమ వసతి గృహాలున్నాయి. నిత్యం ప్రజల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ప్రైవేట్ పాఠశాల విద్యార్థిని మద్యం దుకాణం సమీపంలో వెళుతుండగా అసభ్యంగా ప్రవర్తించారు. ఇలాంటి సంఘటనలు నిత్యం జరుగుతున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఇటీవల ప్రజాప్రతినిధికి విన్నవించారు.



బుచ్చి నగర పంచాయతీలోని శాంతినగర్‌లో మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో మహిళలు పెద్దఎత్తున చేరుకొని ఆందోళన చేశారు. ఇక్కడే మందు బాబులు మద్యం తాగేందుకు పర్మిట్ రూంలు ఏర్పాటు చేయడంతో స్థానికులు దుకాణదారుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు వారిని సర్దుబాటు చేసి పంపారు. మహిళలు మాత్రం ఇక్కడ నివాసాల మధ్య ప్రైవేట్ మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేస్తే ఆందోళన తీవ్రతరం చేస్తామని పోలీసులకు చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

న్యూస్‌టుడే, కోవూరు, ఇందుకూరుపేట

గత వైకాపా పాలనలో మద్యం దుకాణాలు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో వైకాపా నాయకులు గొలుసు దుకాణాల ద్వారా మద్యం దందా కొనసాగింది. అధికారులే నివాసాల నడుమ మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొందరు వ్యాపారులు జనావాసాల్లో దుకాణాలు ఏర్పాటు చేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలో పొదలకూరు, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు, కోవూరు నియోజకవర్గంలో బుచ్చి, పెనుబల్లి తదితర ప్రాంతాల్లో రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసినవి తొలగించాలని స్థానికులు ఆందోళనలు చేయడంతో వివాదం నెలకొంది. ప్రైవేట్ వ్యాపారులు ఇష్టారాజ్యంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారని అధికారులు పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, జాతీయ రహదారులకు వంద మీటర్ల దూరం ఏర్పాటు చేయాల్సి ఉన్నా నిబంధనలు పాటించడం లేదన్న విమర్శలున్నాయి.

● ఎక్సైజ్‌శాఖ సీఐ కిశోర్ మాట్లాడుతూ కోవూరు సబ్‌డివిజన్ పరిధిలోని కోవూరు, కొడవలూరు, విడవలూరు, అల్లూరు మండలాల్లో మద్యం దుకాణాలను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేశామన్నారు. ప్రజల వినతులను ఉన్నతాధికారులకు చెప్పి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆదూరుపల్లిలో గృహోపకరణాలు దగ్ధం

చేజర్ల, న్యూస్‌టుడే: మండలంలోని ఆదూరుపల్లిలో గురువారం రాత్రి అధిక వోల్టేజితో విద్యుత్తు సరఫరా కాగా గృహాల్లోని టీవీలు, ఫ్యాన్లు ఇతర ఉపకరణాలు దగ్ధమయ్యాయి. గ్రామంలో విద్యుత్తు సరఫరాలో తలెత్తిన సమస్యను శుక్రవారం గ్రామస్థులు ఏఈ లిఖితేష్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. సమస్యను పరిష్కరిస్తామని ఆయన వినియోగదారులకు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య : మనుబోలు మండలంలోని బండేపల్లిలో మురుగునీటి కాలువలు అధ్వానంగా ఉన్నాయి. కాలువల్లో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. కాలువల్లో పూడిక తీయించాలి. **- మస్తానయ్య, స్థానికులు**

సమాధానం: మురుగు కాలువల్లో పూడిక తీయించి శుభ్రం చేయిస్తాం. **- వెంకటరమణయ్య, సర్పంచి**

? విడవలూరు మండలం రామతీర్థంలో పలు చోట్ల మురుగు కాలువలు లేక వర్షపు నీరు వీధుల్లో చేరుతుంది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. **- రవి, రామతీర్థం.**

✓ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. **- నగేశ్‌కుమారి, ఎంపీడీవో**

? కొడవలూరు మండలం మానేగుంటపాడులో పారిశుద్ధ్య సమస్యలతో పలువురు ఇబ్బందులు పడుతున్నారు. **- హరి, స్థానికుడు**

✓ పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరిస్తాం. **- సాయిప్రసాద్, ఈవోపీఆర్డీ**

మురుగునీటి బాధలు తప్పించాలి

సంగం, న్యూస్‌టుడే: దువ్వూరు మిట్టపాళెంలో మురుగునీటి బాధలు తొలగించాలని జనసేన నాయకుడు హేమసాగర్ శుక్రవారం ఎంపీడీవో షాలెట్టుకు వినతి పత్రం అందించారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతంలో మహాలక్ష్మమ్మ అరుగు నుంచి మురుగునీటి కాలువ నిర్మాణాన్ని ఉద్దేశపూర్వకంగా చేయలేదన్నారు. ప్రస్తుతం వర్షమొస్తే నీటి నిల్వ అధికం కావడంతో , మురుగు నీరు చేరుతుండటంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారని, అక్కడ కాలువ నిర్మించి సమస్య పరిష్కరించాలని ఆయన ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే అక్కడ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

వర్షమొస్తే మడుగే



నగర పంచాయతీ సుబ్బారెడ్డినగర్‌లో గుడిపల్లికాలువ ఆక్రమణలతో వర్షమొస్తే నీరు పేరుకుపోతోంది. ఈ మార్గంలో వెళ్లాలంటే స్థానికులు, గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. శాశ్వత ప్రాతిపదికన సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పరిశీలించి సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, బుచ్చిరెడ్డిపాళెం

పేదల గూడు... ట్రాక్టరు ఎక్కెను చూడు

నిరుపేదలు నివసించేందుకు అవసరమైన ఇంటిని రూ.20వేల లోపు తక్కువ వ్యయంతో సంగంలో ఇనుప రేకులు, కమ్మీలతో చేస్తున్నారు. వాటిని సిమెంట్ దిమ్మెల మీద ఏర్పాటు చేసి వసతి పొందేందుకు అనువుగా ఉంది. దాన్ని కొనుగోలు చేసిన ఒక కుటుంబం శుక్రవారం ట్రాక్టరు ద్వారా తరలిస్తుండగా 'న్యూస్‌టుడే ' క్లిక్ మనిపించింది. – న్యూస్‌టుడే, సంగం



ఎట్టకేలకు మరమ్మతులు



బుచ్చి నగరపంచాయతీలోని పెద్దూరు వద్ద మలిదేవి డ్రెయిన్ వద్ద రోడ్డు దెబ్బతిందని 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన కమిషనర్ లింగారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి రోడ్డుకు మరమ్మతులు చేశారు. ఎట్టకేలకు సమస్య పరిష్కారమవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

– న్యూస్‌టుడే, బుచ్చిరెడ్డిపాళెం

ముంపులోనే ఉన్నాం..

వర్షాలు తగ్గినా ఇంకా మేము ముంపులోనే ఉన్నాం, మమ్మల్ని పట్టించుకునే వారే లేరని వరిణి పంచాయతీ వీరారెడ్డిపాలెం ఎస్టీ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు కాలువలు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షమొస్తే ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యల పరిష్కరించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, విడవలూరు



మొరాయించిన బస్సు



పామూరు నుంచి నెల్లూరుకు వెళుతున్న ఆర్టీసీ అద్దె బస్సు శుక్రవారం మధ్యాహ్నం సంగంకు వచ్చేసరికి సాంకేతిక లోపానికి గురైంది. ప్రయాణికులు అర్ధాంతరంగా ఆగాల్సి వచ్చింది. వారంతా మండుటెండలో నిరీక్షించారు. కాసేపటికి వేరే బస్సులో వారిని తరలించారు. – న్యూస్‌టుడే, సంగం

మెనూ తప్పని సరిగా పాటించాలి

తోటపల్లిగూడూరు, మనుబోలు, న్యూస్‌టుడే : అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ తప్పనిసరిగా పాటించాలని ఐసీడీఎస్ పీడీ హేనాసుజన పేర్కొన్నారు. మండలంలోని మాచర్లవారిపాలెం, గణపతినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి పలు దస్త్రాలను, పోషకాహార నిల్వలను పరిశీలించారు. చిన్నారులతో మాట్లాడి వారి విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు పరిశుభ్రతతో పాటు క్రమశిక్షణను అలవాటు చేయాలన్నారు. తల్లుల సమావేశం నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏసీడీపీవో రాజ్యలక్ష్మి, సూపర్‌వైజర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ హేనాసుజన

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

తోటపల్లిగూడూరు, మనుబోలు : రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులతో సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ ఏడీఏ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని తోటపల్లిగూడూరు, ఈదూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతుల పాలిట వరమని తెలిపారు. వ్యవసాయాధికారిణి శిరీషారాణి, మత్స్యశాఖ, పశుసంవర్ధకశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

కోవూరు: పిల్లలతో మొక్కలు నాటిస్తే అవి పెద్దవిగా మారి వారిలో ఎంతో ఉత్సాహం కలిగిస్తాయని గ్రంథాలయాధికారి సురేంద్రరెడ్డి తెలిపారు. పట్టణంలోని కాపువీధిలోని శాఖా గ్రంథాలయం ఆవరణలో శుక్రవారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ఆయన మొక్కలు నాటించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు

చిన్న రోడ్డు.. సమస్యలు బోలెడు

గంగవరంలో నిత్యం ట్రాఫిక్ చిక్కులు

కోవూరు మండలం గంగవరం గ్రామానికి చెందిన ఒకరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ప్రాణాపాయస్థితిలో ఆ వ్యక్తిని కారులో నెల్లూరుకు తీసుకెళుతుండగా ముంబయి రహదారికి వెళ్లే మార్గంలో ట్రాఫిక్‌లో చిక్కుకొని అరగంట ఆలస్యంగా నెల్లూరులోని వైద్యశాలకు తీసుకెళ్లారు.

ఒక నిరుద్యోగి ప్రభుత్వ కొలువు సాధనకు పరీక్షా కేంద్రమైన స్థానిక కళాశాలకు బయల్దేరారు. ముంబయి రోడ్డు నుంచి కళాశాలకు వెళ్లే మార్గంలో వాహనాలు నిలిచిపోవడంతో చివరి నిమిషంలో సుమారు కిలోమీటరు దూరం పరిగెత్తుకుంటూ వెళ్లి ఎట్టకేలకు కేంద్రానికి చేరుకున్నారు.

న్యూస్‌టుడే, కోవూరు, ఇందుకూరుపేట

నిత్యం గంగవరం గ్రామానికి వెళ్లే మార్గంలో ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ట్రాఫిక్‌జామ్‌తో గ్రామస్థులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఏక వరుస రోడ్డు ఉండడంతో బస్సు ఎదురుగా వస్తే నడిచి కూడా వెళ్లలేని పరిస్థితి. పక్కన కాసేపు ఆగి వెళుతున్నారు. వాహనాలు, ఆటోల్లో వందలాది మంది ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. నాలుగు దశాబ్దాల క్రితం అప్పటి శాసనసభ్యులు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డిని గ్రామస్థులు రోడ్డు కోసం అభ్యర్థించగా ఆయన మంజూరు చేయించారు. రైతులు ముందుకు వచ్చి తమ పట్టాభూమిలో కొంత స్థలం రోడ్డుకు వదిలారు. ప్రస్తుతం వాహనాల రద్దీ కారణంగా ఇరుకు రోడ్డుగా మారడంతో అవస్థలు తప్పడం లేదు. రాత్రి సమయాల్లో ఇరుకు మార్గంలో వాహనాలు వేగంగా వస్తుండటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

మంజూరైనా జాప్యమెందుకో..

కోవూరులోని రాళ్లమిట్ట నుంచి చెరువు కట్ట మీదుగా గంగవరం నుంచి ముంబయి జాతీయ రహదారిలో కలిసేలా రోడ్డు నిర్మాణానికి రెండున్నర కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. కొంత మంది రైతులు న్యాయస్థానం ఆశ్రయించడంతో పనులు


గంగవరం నుంచి ముంబయి జాతీయ రహదారికి వెళ్లే రోడ్డు దుస్థితి

నిలిచిపోయాయి. ఇటీవల సమస్య పరిష్కారమవడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని స్థానికులు విన్నవిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్లు ధ్వంసం

పొదలకూరు, న్యూస్‌టుడే: పొదలకూరు దాబా సమీపంలో కారు అదుపు తప్పి బీభత్సం సృష్టించిన ఘటన శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. నెల్లూరుకు చెందిన వారు కారులో పెంచలకోనకు బయల్దేరారు. ఒక కారు అదుపు తప్పి ఎదురుగా ద్విచక్రవాహనాన్ని ఢీ కొని, రోడ్డు పక్కన ఆగిన కలువాయి మండలం పర్లకొండ గ్రామానికి చెందిన వ్యక్తి కారుపై వేగంగా దూసుకెళ్లడంతో సుమారు 60 అడుగుల దూరం వెళ్లింది. ఢీకొన్న కారు కొంత దూరంలో తాటి చెట్టును ఢీకొని నిలిచింది. కారులో ఉన్నవారంతా సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చెట్టును ఢీకొని నిలిచిన కారు

నిఘా నేత్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు

పొదలకూరు, న్యూస్‌టుడే: వరుస చోరీలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పొదలకూరు సీఐ రాంబాబు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్ అండ్‌బి అతిథి భవనంలో ఏర్పాటు చేసిన దుకాదారులు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి దుకాణానికి నిఘానేత్రం ఏర్పాటు చేసుకోవాలన్నారు. తాము ఇప్పటికే పట్టణంలో 152 నిఘానేత్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామన్నారు. త్వరలో ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందన్నారు. ఎక్కడైనా అనుమానిత వ్యక్తులు ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై హనీఫ్, సిబ్బంది అక్తర్‌భాష, రసూల్, భాస్కర్, రమేష్ తదతరులు పాల్గొన్నారు.


వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రాంబాబు

నేత్రదానం

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరు పట్టణంలో పలు సేవకార్యక్రమాలు చేపట్టిన బండి సుధాకర్‌రెడ్డి నెల్లూరు గోమతినగర్ వద్ద స్వగృహంలో శుక్రవారం మృతిచెందారు. కుటుంబ సభ్యులు అనుమతితో నెల్లూరు అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఆయన నేత్రాలు సేకరించినట్లు దేవిరెడ్డి సురేష్‌రెడ్డి తెలిపారు.

In the Court of the I Addl. Senior Judge : Nellore

I.P. No: 44/2024

Krishnamaneni Sreenivasulu Naidu, S/o. Krishnam Naidu ... Petitioner

Vs.

1. **Junju Veeraiah** S/o. Prathap, resident of Nidiguntapalem Village, Venkatachalam Mandalam, SPSR Nellore District.
2. **Junju Durga Bhavani** W/o. Golla Sandeep, D/o. Junju Veeraiah, resident of Amudhalapadu, Pidathapoluru Village, Muthukuru Mandalam, SPSR Nellore District.

జనరల్ నోటీసు

పై నెంబరున పిటిషనరు 1వ రెస్పాండెంట్‌ను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని మరియు 1వ రెస్పాండెంట్ 2వ రెస్పాండెంట్ పేరిటకి వ్రాసి ఇచ్చిన రిజిష్టర్డు సెటిల్‌మెంట్ పత్రం **తేది: 12-03-2024** డాక్యుమెంట్ నెం. **4579/2024** (SRO, Muthukuru) రును రద్దుపరచమని కోరుతూ పై తెలిపిన కోర్టులో క్రెడిటార్ I.P. No: 44/2024ను దాఖలు చేసియున్నందున, I.P. పై ఎవ్వరికైనను ఆక్షేపణలు ఉన్న యెడల **తేది: 23-10-2024**న ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినదిగా ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

దామా ధమరేశ్వర్, B.A., B.L., పిటిషనరు తరపు అడ్వకేట్, నెల్లూరు

వెంకటగిరి నియోజకవర్గ సమాచారం

నిమ్మలో సస్యరక్షణపై అవగాహన

సైదాపురం, న్యూస్‌టుడే: పూత, పిందె దశలో ఉన్న నిమ్మచెట్లలో వచ్చే వివిద రకాల తెగుళ్లను సకాలంలో గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానశాఖాధికారి ఆనంద్ సూచించారు. మండలంలోని చాగణంరాజుపాళెం గ్రామంలో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున నిమ్మకు వివిధ రకాల తెగుళ్ల సోకే అవకాశముందన్నారు. సకాలంలో తెగుళ్లను గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయాధికారిణి హైమావతి, గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

తపాలా అధికారికి మూడు నెలల జైలు

రాపూరు, న్యూస్‌టుడే : మండలంలోని గుండవోలు తపాలా కార్యాలయంలో ఖాతాదారుల నగదును పోస్టల్ అధికారి కోదండపాణి స్వాహా చేయడంతో రాపూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. శుక్రవారం వెంకటగిరి కోర్టులో కేసు విచారణకు రావడంతో నగదు స్వాహా చేసిన నిందితుడికి మూడు నెలల జైలు శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధించినట్లు రాపూరు ఎస్ఐ రాజేశ్ తెలిపారు.

గిరిజన మహిళ మృతిపై విచారణ

రాపూరు, న్యూస్‌టుడే: గిరిజన మహిళ చెంచులక్ష్మి ఆత్మహత్య ఘటనపై శుక్రవారం ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ విచారించారు. రాపూరులో పలువురిని విచారించి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం దస్త్రాలు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

నిధుల దుర్వినియోగంపై దర్యాప్తు

రాపూరు, న్యూస్‌టుడే : రాపూరు వెలుగు కార్యాలయంలో నిధులు దుర్వినియోగం అయ్యాయన్న అంశంపై జిల్లా అధికారులకు పలువురు ఫిర్యాదు చేశారు. డీఆర్‌డీఏ అధికారులు శుక్రవారం విచారణకు వచ్చి ఏపీఎం రాధతో సమావేశమయ్యారు. ఫిర్యాదుదారులు రాకపోవడంతో విచారణ చేయలేకపోయామని డీఆర్‌డీఏ అధికారులు భానుప్రసాద్, దుర్గా శ్రీనివాస్, రత్నమ్మ పేర్కొన్నారు

అధిక ఫీజులను నియంత్రించండి

వెంకటాచలం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు లేకపోవడంతో ప్రైవేటు కళాశాలలు ఇష్టారాజ్యంగా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నాయని రెవల్యూషనల్ విద్యార్థి సంఘం జిల్లా నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అధిక ఫీజులు తీసుకుంటున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీఎస్‌యూ వీసీ విజయ భాస్కరరావును కలిసి వినతి పత్రం అందజేసి మాట్లాడారు.


ప్రవేశాల గడువు పొడిగించండి

వెంకటాచలం, న్యూస్‌టుడే: వీఎస్‌యూలో జరుగుతున్న స్పాట్, మేనేజ్‌మెంట్ ప్రవేశాల గడువు వారం పాటు పెంచాలని టీఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షులు వెంకటాద్రి కోరారు. విశ్వవిద్యాలయంలో శుక్రవారం వీసీ విజయ భాస్కరరావును కలిసి వినతిపత్రం అందజేశారు.

బంగారం దుకాణంలో చోరీకి విఫల యత్నం

పొదలకూరు, న్యూస్‌టుడే: పొదలకూరు పట్టణంలోని ప్రధాన రహదారిపై సన్నికంటి రాధయ్యకు చెందిన బంగారు నగల దుకాణంలో గురువారం అర్ధరాత్రి దుండగులు చోరీకి యత్నించారు. ఎదురుగా ఉన్న మిద్దెపై ఉన్నవారు గుర్తించి కేకలు వేయడంతో చోరీకి ఉపయోగించిన జాకీ, గడ్డపారలు అక్కడే వదిలేసి పరారయ్యారు. దీన్ని గుర్తించి దుకాణ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పొదలకూరు సీఐ రాంబాబు, ఎస్సై మహ్మద్ హనీఫ్ సంఘటన స్థలానికి చేరుకొని దొంగతనానికి ఉపయోగించిన పరికరాలు పరిశీలించి వేలిముద్ర నిపుణులను పిలిపించి ముద్రలు సేకరించారు. కేసునమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

అకాల వర్షం.. రైతుకు నష్టం


కలువాయిలో వర్షాలకు నేల వాలిన వరి

న్యూస్‌టుడే, కలువాయి, మనుబోలు

మూడు రోజులు కురిసిన వర్షాలతో కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాలతో పాటు రాపూరు, సైదాపురం, కలువాయి మండలాల్లో పంట చివరి దశలో ఉన్నవారు నష్టపోయారు.. మెట్టప్రాంతంలో అంతంత మాత్రం దిగుబడి ఉండటంతో అకాల వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లింది. కోతకు వచ్చిన వరి నేలవాలడంతో రైతన్నకు కంటి మీద కునుకు లేకుండా చేసింది.

● కలువాయిలో దాదాపు 300 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. పంట కోతకు రావడంతో కొంత మంది ముందస్తుగా విక్రయించినా ఆశించిన దిగుబడులు లేవు. కొంతమందికి ఎకరాలకు 20 నుంచి 25 బస్తాలు మాత్రమే చేతికి రావడంతో నష్టాల పాలయ్యారు. అకాల వర్షాలతో రైతన్న కుదేలయ్యారు. వర్షాల ప్రభావంతో దాదాపు 200 ఎకరాల్లో కోతలకు వచ్చిన పంట దెబ్బతింది.

● పొదలకూరు, మనుబోలులో కోతకు వచ్చిన పంట నేలవాలడంతో గింజలు మొలకెత్తాయి. కొన్ని చోట్ల పొలాల్లో నీరు ఎక్కువగా ఉండటంతో కోత కోసేందుకు యంత్రాలు అందుబాటులో లేక అవస్థలు పడుతున్నారు. దిగుబడి తక్కువగా ఉన్నా పెట్టుబడులైనా వస్తాయేమోనన్న ఆశతో అన్నదాతలు శ్రమిస్తున్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని విన్నవిస్తున్నారు.

● వ్యవసాయాధికారి ప్రతాప్ మాట్లాడుతూ... వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను శాస్త్రవేత్తల ద్వారా ప్రాథమికంగా పరిశీలించామన్నారు. ఎంత నష్టం వాటిల్లిందో వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

శిరస్త్రాణం ధరిస్తే సురక్షిత ప్రయాణం

వెంకటాచలం : శిరస్త్రాణం ధరిస్తే సురక్షిత ప్రయాణం సాధ్యమని ఎస్సై ఆంజనేయులు సూచించారు. వెంకటాచలంలోని సర్వేపల్లి రోడ్డు కూడలి వద్ద శుక్రవారం శిరస్త్రాణం వినియోగంపై వాహన దారులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రహదారిపై సురక్షిత ప్రయాణానికి సహకరించాలన్నారు.

నెల్లూరు

•నెల్లూరు •నెల్లూరు గ్రామీణం

సమస్య: పత్తేఖాన్‌పేట రైతుబజారు సమీపంలో జీఎన్‌టీ రోడ్డుపై రాత్రి పూట పశువులు గుంపులుగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. - రంగనాథం
సమాధానం: పశువులను గోశాలకు తరలించేందుకు చర్యలు చేపడతాం. - డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి
? పద్మావతినగర్ నాగులపుట్ట వీధిలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. - విశేషగిరిరావు
✓ కుక్కలు పట్టేందుకు చర్యలు చేపడతాం. - డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి
? అంబేడ్కర్ నగర్‌లో కాలువలు పూడికతో నిండిపోయి.. మురుగునీరు ముందుకు కదలడం లేదు. - సుకన్య
✓ కాలువల్లో పూడిక తీయిస్తాం. - డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి
? 17వ డివిజన్ గుండ్లపాళెం రెండో సచివాలయం పరిధిలో వాహనం రాకపోవడంతో చెత్త పేరుకుపోయింది. - రమణ
✓ వాహనం వచ్చేలా చేస్తాం. - డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి
- న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్, స్టోన్‌హౌస్‌పేట)

విద్యుత్తు సిబ్బందికి అభినందనలు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: జిల్లాలో సంభవించిన భారీ వర్షాల వల్ల విద్యుత్తుకు అంతరాయం కలగకుండా కష్టపడి పనిచేసిన అధికారులు, సిబ్బందిని విద్యుత్తు శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ వి.విజయన్ అభినందనలు తెలిపారు. శుక్రవారం నగరంలోని విద్యుత్తు భవన్‌లో ఆయన మాట్లాడుతూ అన్ని డివిజన్ల అధికారులు, సిబ్బంది ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల ఎలాంటి ప్రమాదాలు, నష్టాలు జరగలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ అకౌంట్స్ అధికారి మురళి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: సిబ్బంది సంక్షేమమే ధ్యేయమని ఎస్పీ జి.కృష్ణకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం పోలీసు కార్యాలయంలో ఎస్పీ సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. బదిలీలు, ఆరోగ్య సమస్యలు, సస్పెన్షన్ తొలగించాలని 19 మంది తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలను విన్న ఎస్పీ పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.


సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ

నగరాభివృద్ధికి సహకరించండి

నెల్లూరు(నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరపాలకసంస్థ పరిధిలోని భవన యజమానులు కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన ఆస్తి, కుళాయి, డ్రైనేజీ, ఇతర పన్నులు సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ సూర్యతేజ ప్రకటనలో తెలిపారు. సకాలంలో పన్నులు చెల్లించని భవన యజమానులకు సంబంధించిన కుళాయి, డ్రైనేజీ, విద్యుత్తు కనెక్షన్లు నిలుపుదల చేస్తామని తెలియజేశారు.

ప్రమాణాలకు పాతర!

దేవరపాళెం-కందమూరు రోడ్డు పనుల్లో నాణ్యత లేమి


నిర్మాణంలో ఉన్న రోడ్డు

నెల్లూరు రూరల్ మండలంలోని తాటిపర్తి రోడ్డు గుంతలమయంగా మారి ప్రమాదాలకు నెలవైంది. ఎందరో ప్రాణాలు కోల్పోయారు. మరి కొందరు వికలాంగులుగా మారారు. రోడ్డు బాగు కోసం గ్రామాల ప్రజలు ఎదురుచూశారు. తీరా పనులు మొదలైనా వారిలో సంతోషం లేదు. నాణ్యతపై పెదవి విరుస్తున్నారు.

న్యూస్‌టుడే, నెల్లూరు(గ్రామీణం)

నెల్లూరు గ్రామీణ నియోజకవర్గం నరసింహకొండ దేవరపాళెం నుంచి వెల్లంటి మీదుగా తాటిపర్తి వెళ్లే రోడ్డుపై ములుమూడి, సౌత్‌మోపూరు, కొత్త, పాతవెల్లంటి, సజ్జాపురం, గొల్లకందుకూరు, కందమూరు, ఉప్పుటూరు, పొదలకూరు మండలం తాటిపర్తి పరిసర ప్రాంతాల వారు రాకపోకలు సాగిస్తుంటారు. తారు రోడ్డు నిర్మించిన తరువాత అయిదేళ్లకు ఒకసారి రోడ్డు పునర్నిర్మాణ పనులు జరుగుతాయి. 2013లో పనులు జరిగిన ఆ తరువాత మళ్లీ జరగలేదు. గత ప్రభుత్వంలో పనులు చేస్తామని ప్రకటించినా చేయలేదు. గుంతలమయంగా మారడంతో గత అయిదేళ్లుగా ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డు పనులకు ఈ ఏడాది సెప్టెంబరులో రూ.4.85 కోట్లు మంజూరు కాగా.. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. ములుమూడి గ్రామంలో సిమెంట్ రోడ్డుతో పాటు చెరువు కలుజు ఉన్న చోట మినహా.. దేవరపాళెం 11 కి.మీ. నుంచి కందమూరు వెళ్లే క్రాస్ రోడ్డు 26 కి.మీ. వరకు తారు రోడ్డు పనులు జరుగుతాయి. కొన్నిచోట్ల రోడ్డు వెడల్పు 5.50 మీటర్లు ఉండగా కొంత మేర 3.75 మీటర్లు ఉంది.

నాసిరకంగా..

రోడ్డు పనులు జరుగుతున్న తీరు చూసి ప్రజలు పెదవి విరుస్తున్నారు. 40ఎంఎం సైజ్ కంకర వేసి రోలింగ్ వేస్తున్నారు. రోడ్డు మార్జిన్లలో పక్కనే ఉన్న మట్టిని కొంత వేసి చదును చేస్తున్నారు. పలు మార్లు రోలింగ్ చేస్తేనే గట్టిదనం ఉంటుంది. వినియోగిస్తున్న కంకర నాసిరకంగా ఉంది. ఇది నుసుపు ఎక్కువగా, ఒక ఆకారం అంటూ లేకుండా ఉంది. దీనివల్ల పటుత్వం ఉండదని, రోడ్డు మన్నిక ఎక్కువ కాలం ఎలా ఉంటుందనే మాటలు వినిపిస్తున్నాయి. దగ్గరగా ఉన్న క్వారీ నుంచి అనుమతి ఉందనే కారణంతో వినియోగిస్తున్నట్లు సమాచారం. పనులు నాణ్యతతో చేయాలని ప్రజలు కోరుతున్నారు.

క్వారీ నుంచే కంకర సరఫరా

ర.భ శాఖ సంబంధించిన తారు రోడ్డు పనుల్లో మార్జిన్లలో గ్రావెల్ వేయడం ఉండదు. అక్కడ ఉన్న మట్టిని వినియోగిస్తాం. తక్కువైన చోట పరిసర ప్రాంతాల్లో మట్టిని పోస్తాం. రోలింగ్ పనులు చేయడం ద్వారా ఎటువంటి ఇబ్బంది ఉండదు. పనులు నాణ్యతతో జరుగుతున్నాయి. అనుమతి ఉన్న క్వారీ నుంచే కంకర తీసుకువచ్చి ఉపయోగిస్తున్నాం. - చంద్రశేఖర్, ర.భ ఏఈ

ఆకట్టుకున్న అష్టావధానం

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: అవధాని డాక్టర్ సూరం శ్రీనివాసులు అధ్యక్షతన అవధాని డాక్టర్ కొండపి మురళీకృష్ణ నిర్వహించిన అష్టావధానం ఆకట్టుకుంది. టౌన్‌హాలు ప్రాంగణంలోని జూనియర్ రెబాల లక్ష్మీనరసారెడ్డి స్మారక భవనంలో శుక్రవారం రాత్రి పద్య కళాపరిషత్ ఆధ్వర్యంలో దివంగత ఆచార్యులు పోలూరు హనుమజ్జానకీరామ శర్మ శత జయంతి ముగింపు వేడుకలను పురస్కరించుకుని అష్టావధానం నిర్వహించారు. పద్య కళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, కార్యదర్శి నెలబల్లి బలరామయ్య నాయుడు, నిర్వాహకులు వేదం వెంకట రాఘవకృష్ణ ఆధ్వర్యంలో హనుమజ్జానకీరామశర్మ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పోలూరు హనుమజ్జానకీరామశర్మ జీవితం-సాహిత్యం పుస్తకాన్ని వితరణ చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న అవధానులు, పృచ్ఛకులు

తూములు ఏర్పాటు చేయాలి

నెల్లూరు(గ్రామీణం), న్యూస్‌టుడే: నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్‌మోపూరు రామన్న చెరువు వద్ద గ్రామాలకు వెళ్లే ప్రధాన మార్గం దెబ్బతినకుండా శాశ్వత ప్రాతిపదికన తూములు ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తూము వద్ద ధర్నా నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి ఆలూరు తిరుపాలు, కమిటీ సభ్యుడు పూడిపర్తి జనార్దన్, నాయకులు జానా లక్ష్మీప్రసాద్, శ్రీపతి వెంకయ్య, అనిల్, బాలు ఆదిశేషయ్య, అనంతయ్య, రత్నం, పర్చూరు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరంలోని 42వ డివిజన్ కోటమిట్టలో విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ కారణంగా నష్టపోయిన బాధితుడు చెంచయ్య కుటుంబానికి ... వైకాపా నగర నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబానికి వైకాపా తరఫున సాయం అందించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో వైకాపా మైనార్టీ సెల్‌రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హంజా హుస్సేని, నాయకులు అబ్దుల్ మస్తాన్, జాహిద్, అతహర్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.



హెచ్చరిక బోర్డు ఎదుటే వ్యర్థాలు

నగరంలోని మినీబైపాస్ రోడ్డులో 'ఇచ్చట చెత్త వేయరాదు.. తెలిసి కూడా చెత్తవేస్తే చట్టపరంగా శిక్షార్హులు' అంటూ నగరపాలకసంస్థ ఏర్పాటు చేసిన బోర్డు వద్దే చెత్త పేరుకుపోయింది. వర్షాల సమయంలో కాలువలోని వ్యర్థాలను జేసీబీ సహాయంతో తీసి రోడ్డుపై వేశారు. నాలుగు రోజులైనా తొలగించలేదు. రహదారిపై అడ్డంగా మారింది. అధికారులు చెత్త కుప్పను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చర్యలు తీసుకుంటామని ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య తెలిపారు.
- న్యూస్‌టుడే, నెల్లూరు(పొదలకూరురోడ్డు)

రక్షణ గోడ కూలి కష్టాలు

నెల్లూరు నగరంలోని పెద్దబజారు గచ్చుకాలువ వద్ద వంతెనపై రక్షణ గోడ ఇటీవలి వర్షాలకు కూలిపోయింది. దీనివల్ల తాగునీటి పైపులు విరిగిపోవడంతో అధికారులు మరమ్మతులు చేసి నీటి సరఫరాకు ఆటంకం లేకుండా చేశారు. నిత్యం ప్రజలు, వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రాంతంలో రక్షణ గోడ కూలిపోవడంతో ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. అధికారులు స్పందించి గోడను నిర్మించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)





తవ్వుతారు.. పట్టించుకోరు

హరనాథపురం రెండో వీధిలో కార్పొరేషన్ అధికారులు కుళాయిల మరమ్మతులకు సిమెంట్‌రోడ్లను తవ్వి వదిలేయడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇరుకు రోడ్డు కావడంతో సగం రోడ్డు వరకు తవ్విన గుంతల్లో మట్టిపోసి వదిలేయడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇదే పరిస్థితి నగరంలో పలుచోట్ల ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గుంతలను కంకర వేసి పూడ్చించాలని స్థానికులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, నెల్లూరు(రంగనాయకులపేట)

అధికారులూ.. వీటిని తొలగించలేరా?

నగరంలోని ఆకుతోట, హరనాథపురంలో చెత్త, వ్యర్థాలు రోజుల తరబడి తొలగించడం లేదు. చెత్త రోడ్లమీదకు వస్తోంది. మూడో వీధిలో గత కొన్ని రోజులుగా మలుపు వద్ద చెట్లకొమ్మల వ్యర్థాలు ప్రమాద భరితంగా తయారయ్యాయి. చెత్త, మట్టి, వ్యర్థాలు గుట్టలుగా ఉన్నాయి. కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నెల్లూరు(ఏసీసెంటర్)



నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: నగరంలోని పలు సబ్‌స్టేషన్ల మరమ్మతులు, విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలగించడంలో భాగంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు అంతరాయం ఉంటుందని ఈఈ ఎం.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శెట్టిగుంట రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలోని అయ్యప్పగారితోట, దీనదయాళ్ నగర్, పల్లిపాడురోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు ఉండదు. వెంకటేశ్వరపురం సబ్‌స్టేషన్ ప్రాంతంలోని గాంధీగిరిజన కాలనీ, వారధి సెంటర్, సాలుచింతల పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తుకు అంతరాయం ఉంటుంది. యనమల వారి దిన్నె సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలైన కేవీ బలిజపాళెం, మిట్టపాళెం, మల్లెలమ్మతోట తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు ఉండదు. ఎంజీనగర్ సబ్‌స్టేషన్ ప్రాంతంలో బ్రహ్మానందపురం, రాజగోపాలపురం, ఆదర్శనగర్, సుజాతమ్మకాలనీ, జేవీఆర్ కాలనీ, లక్ష్మీపురం, బెజవాడ ఓబుల్ రెడ్డి నగర్, కేవీఆర్ పెట్రోల్‌బంకు ఏరియా, ఏస్పీ ఆఫీస్, నీలగిరి సంఘం, బట్వాడిపాళెం, బారాషాహిద్ దర్గా పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తుకు అంతరాయం ఉంటుందని ఈఈ తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగరపాలకసంస్థ పరిధిలో నూతన భవన నిర్మాణాలకు లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ (ఎల్‌టీపీ) భవన అనుమతుల కోసం పొందుపరచాల్సిన పత్రాలన్నీ తప్పనిసరిగా సమర్పించాలని కమిషనర్ సూర్యతేజ తెలిపారు. శుక్రవారం కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటరు విభాగంలో టౌన్‌ప్లానింగ్ ఎల్‌టీపీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ అనుమతి పొందిన తర్వాత భవన నిర్మాణం మొదలు పెట్టేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ప్రకారం నిర్మాణం జరిగేలా పర్యవేక్షించాలని, ఉత్తర్వులు ఉల్లంఘించిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనుమతి పొందిన భవన నిర్మాణానికి సంబంధించి సెట్‌బ్యాక్స్ అనుమతి ప్రకారం ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు వేణు, దశయ్య, నుడా పీవో సుబ్బారావు, పట్టణప్రణాళిక విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

మద్యం దుకాణం ఏర్పాటు తగదు

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: తమ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దని వెంకటేశ్వరపురం విజయా డెయిరీ ప్రాంతవాసులు కోరారు. ఈ విషయంపై శుక్రవారం వారు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏఈఎస్ రమేష్‌కు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ విజయా డెయిరీ ప్రాంతంలో తాము ఎన్నో ఏళ్లుగా జీవిస్తున్నామని, ఇక్కడమహిళలు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. స్థానిక మహిళలు సైతం ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం పాల కోసం డెయిరీకి వెళతారన్నారు. సమీపంలోనే స్కూలు, మసీదు ఉన్నాయన్నారు. డెయిరీ పక్కన మద్యం దుకాణం ఏర్పాటుకు వ్యాపారులు చూస్తున్నారని, ఇది ఏర్పాటైతే ఈ ప్రాంతంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెల్లూరుగ్రామీణం : పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా నెల్లూరు రూరల్ మండలం ములుమూడిలో రూ.20 లక్షలతో సీసీ డ్రెయిన్ పనులకు తెదేపా నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ బూడిద విజయ్‌కుమార్, అల్లాభక్షు, కరుణాకర్, మీరామొహిద్దీన్ పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు



నెల్లూరుగ్రామీణం, న్యూస్‌టుడే: నెల్లూరు రూరల్ మండలం ములుమూడి నుంచి సౌత్‌మోపూరు వైపు వెళ్లే మార్గంలో రామన్న చెరువు నుంచి వచ్చిన నీటి ఉద్ధృతితో రోడ్డు కోసుకుపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమస్యపై 'పాలకుల పాపం.. ఏటా సమస్య పునరావృతం' శీర్షికన శుక్రవారం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ర.భ, ఇతర శాఖల అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయించారు.

రక్షణ చట్టాలపై విద్యార్థులకు అవగాహన

నెల్లూరు (బీవీ నగర్) : నెల్లూరుగ్రామీణ పరిధిలోని బుజబుజనెల్లూరులో గల ఉన్నత పాఠశాలలో శుక్రవారం వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్ కిశోర్‌కుమార్ విద్యార్థులకు రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మత్తు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, ట్రాఫిక్ నిబంధనలు తదితరాలపై వివరించారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ కిశోర్‌కుమార్

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: వైద్యఆరోగ్యశాఖలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ హంస కోరింది. నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో పెంచలయ్యను ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘ నాయకులు కలిసి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ హంస జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, మురళి, మహేష్, ఉమామహేశ్వర్, కె.నాగయ్య తదితరులు పాల్గొన్నారు.
❖ డీఎంహెచ్‌వోను జిల్లా విలేజ్ వార్డు సచివాలయం హెల్త్ సెక్రటరీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు కలిసి వినతి పత్రం అందజేశారు. సచివాలయం హెల్త్ సెక్రటరీ గ్రేడ్ 3 ఏఎన్ఎంలకు ఎంపీహెచ్‌ఏ ఫిమేల్ ప్రమోషన్‌కు సంబంధించిన మెరిట్ లిస్టులో అందరి ర్యాంకులు తారుమారు అయ్యాయని తెలిపారు. సవరించి జాబితాను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు స్నేహలత, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హైమావతి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుకు గడువు పెంపు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖ 2024-25 విద్యా సంవత్సరానికి బీడీ, సున్నపురాయి, డోలమైట్, మైకా, ఐరన్ ఓర్, మాంగనీస్, సినీ కార్మికుల పిల్లలు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఇచ్చిన గడువును పొడిగించినట్లు బీడీ కార్మికుల సంక్షేమ వైద్యశాల ఇన్‌ఛార్జి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.అర్జునరావు ప్రకటనలో తెలిపారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్నవారు ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు హెల్ప్‌లైన్ నెంబర్ 0120-6619540, టెలిఫోన్ నెంబర్ 040-29561297ను సంప్రదించాలని కోరారు.

తెరపై ఈనాడు

ఎం-1 సినిమాస్- స్క్రీన్1.. విశ్వం, స్క్రీన్-2.. దేవర, స్క్రీన్3.. వెట్టయ్యన్, స్పైస్‌సినిమాస్(ఎంజీబీ మాల్)- స్క్రీన్1.. వెట్టయ్యన్, స్క్రీన్2.. జనక ఐతే గనక, స్క్రీన్3.. ది వైల్డ్ రోబోట్, స్క్రీన్4.. విశ్వం, స్క్రీన్5.. దేవర, రెయిన్‌సినిమాస్-స్క్రీన్1.. దేవర, దివైల్డ్ రోబోట్, విశ్వం, స్క్రీన్2.. విశ్వం, దేవర, స్క్రీన్3.. వెట్టయ్యన్, స్క్రీన్4.. విశ్వం, లవ్‌రెడ్డి, సిరిమల్టీప్లెక్స్.. స్క్రీన్1.. దేవర, స్క్రీన్2.. వెటయ్యన్, విశ్వం స్క్రీన్3.. విశ్వం, వెట్టయ్యన్, స్క్రీన్4.. జనక అయితే గనక

వర్షమొస్తే.. ఏటా అదే సమస్య

న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

రోడ్ల నిర్మాణ సమయంలో పర్యవేక్షణ లేక నిర్మాణం పూర్తయిన తరువాత రోజుల తరబడి నీళ్లు నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారుతున్నాయి. నగరంలో లక్షలాది రూపాయలు వెచ్చించి రోడ్ల నిర్మాణాలు చేస్తున్నారు. పనులు చేసే ముందు భవిష్యత్తులో తలెత్తే సమస్యలపై ఇంజినీరింగ్ అధికారులు ఆలోచించడం లేదు. ఫలితంగా నిర్మాణం చేసిన కొద్దిరోజులకే రూపురేఖలు కోల్పోతున్నాయి. నిర్మాణ సమయంలో ముందుగా తీసుకునే కొలతల్లో లోపమో, పర్యవేక్షణ లేకపోవడమో కారణం ఏదైనా రోడ్లకు శాపమవుతోంది. ❖ నగరంలోని దాదాపు 54 డివిజన్‌లు ఉన్నాయి. వీటి పరిధిలోని 60 శాతం కార్పొరేషన్ పరిధిలో.. ప్రధాన మార్గాల్లో మిగతా 40 శాతం రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ పర్యవేక్షణలో ఉన్నాయి. రెండు శాఖల ఆధ్వర్యంలో నిర్మించిన పలు రోడ్లలో వర్షాలు వచ్చి, తగ్గి పోయిన రెండు రోజుల వరకు నీరు అలాగే ఉండిపోతోంది.


జలమయంగా మారిన జిల్లా పోలీసు కార్యాలయం రోడ్డు(పాత చిత్రం)

నీరు నిలిచిపోయి..

నగరంలోని బట్వాడిపాళెం, మూలాపేట, లీలామహల్ రోడ్డు, వీఆర్‌సీ కూడలి, సత్యసాయి పాత సదన్ సమీపాన కలెక్టర్ నివాస భవనానికి ఎదురుగా ఉన్న ప్రధాన రోడ్డు, జిల్లా పరిషత్ ప్రధాన కార్యాలయానికి వెళ్లే దారిలో, కేవీఆర్ పెట్రోల్ బంకు కూడలికి సమీపంలో, దర్గామిట్ట రోడ్డు, నిప్పో ఫ్యాక్టరీ సమీపాన ఇలా పలుచోట్ల చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోతోంది. నీరు వెళ్లే కాలువలు లేక ఈ దుస్థితి నెలకొంది. ❖ సమస్యను ఇరు శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి.. ఇక నుంచి లోపాలు లేకుండా చూస్తామని చెబుతున్నారు.

ధ్రువపత్రాల పరిశీలన

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో కాంట్రాక్టు విధానంలో పనిచేసేందుకు బోధనా పోస్టుల భర్తీకి శుక్రవారం అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు. కార్యక్రమం నగరంలోని సమగ్రశిక్షా అభియాన్ కార్యాలయంలో జరిగింది. ఎస్ఎస్ఏ ఏపీసీ సీహెచ్ ఉషారాణి మాట్లాడుతూ 31 పోస్టులకు 498 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమం శనివారం కూడా జరగనుందన్నారు. అనంతరం మెరిట్ లిస్టు సిద్ధం చేసి కలెక్టర్, రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.


పరిశీలిస్తున్న సమగ్రశిక్షా అభియాన్ అధికారులు